Published From
VIJAYAWADA
Visakhapatnam
Tirupati

శుక్రవారం, 7 ఆగస్టు 2026

సంపుటి: 1 | సంచిక: 362

వెల : 5/- | పేజీలు: 8

# నంబర్ వన్

NUMBER ONE Telugu Daily

టీ20 క్రికెట్‌లో కొత్త రారాజు



8



# కేబినేట్ కీలక నిర్ణయాలు

## దిశ బిల్లు-2019, ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు-2024ల ఉపసంహరణ

- యూడీఏల పునర్వ్యవస్థీకరణకు ఆమోదం
- రెండు కొత్త ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు
- కొత్త జిల్లాలకు 15 కొత్త డీఈవో పోస్టులు
- అమరావతి క్యాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్‌కు రూ.1002.49 కోట్లు కేటాయింపు
- వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి



**అమరావతి, నంబర్ వన్:** పలు కీలక నిర్ణయాలకు ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో 34 అజెండా అంశాలపై చర్చించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ యాక్ట్-2026, ఏపీ పీపీపీ పాలసీ-2026 ముసాయిదాకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దిశ

మిగతా 2 లో

# పరామర్శల పేరుతో రాష్ట్రంలో విధ్వంసం

## గొడ్డలి పార్టీ.. క్రిమినల్స్ తయారీ అడ్డా! : సీఎం

- గంజాయి బ్యాచ్‌నూ జెన్‌జీగా చెప్పుకోవడం ఆ పార్టీకే చెల్లు
- అసూయతోనే డీఎస్సీపై యాగీ
- ఏడాది తర్వాత ధర్నాలు చేయడమేంటి?
- నాడు 'దిశ' పేరుతో ప్రజలను మభ్యపెట్టారు
- పనిచేయడమే కాదు.. ప్రజలతో సంధానమూ ముఖ్యమే.. నిత్యం వారితో ఉండండి: బాబు
- క్యాబినెట్ భేటీ అనంతరం మంత్రులతో చర్చ

**అమరావతి, నంబర్ వన్:** గంజాయి బ్యాచ్‌ను వెంటేసుకుని తిరుగుతూ.. వారిని జెన్‌జీ అని చెప్పుకోవడం గొడ్డలి పార్టీకే చెల్లిందని సీఎం చంద్రబాబు అన్నారు. జగన్ పరామర్శల పేరుతో విధ్వంసం సృష్టిస్తున్నారని, దేవరపల్లి పర్యటనలో అడవి పందులు పొలాల్ని నాశనం చేసినట్లు గొడ్డలి పార్టీ నేతలు చిరువ్యాపారుల దుకాణాలను, పొగాకు రైతుల కష్టాన్ని ధ్వంసం చేశారని విమర్శించారు. రాజకీయ పార్టీ ముసుగులో.. క్రిమినల్స్ తయారీ అడ్డాగా గొడ్డలి పార్టీ మారిందన్నారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం క్యాబినెట్ సమావేశంలో ఎజెండా అంశాలపై చర్చ అనంతరం సీఎం సహచర మంత్రులతో తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. ఈ సందర్భంగా జగన్ పరామర్శ యాత్రలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పరామర్శ ముసుగు తగిలించుకుని గొడ్డలి పార్టీ

మిగతా 2 లో



2

## నేడే నేతన్న సేవలో..

- చేనేత కార్మికుల ఖాతాల్లో రూ.25 వేలు
- చీరాలలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- 71,536 కుటుంబాలకు 179 కోట్లు

# గిరిజన హక్కుల పరిరక్షణలో రాజీ లేదు

- ఆదివాసీల అండగా వైసీపీ
- వైసీపీ ఎస్టీ సెల్ నేతలకు అధినేత జగన్ దిశానిర్దేశం
- జగన్‌తో విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ ప్రతినిధుల భేటీ
- ఖాళీల భర్తీకి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి



**అమరావతి :** గిరిజన చట్టాలు, ఆదివాసీల హక్కుల పరిరక్షణకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందని, ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి

మిగతా 2 లో



# బయో గ్యాస్ ఉత్పత్తికి ప్రోత్సాహం

- రూ.23,731 కోట్ల గోబర్ధన్ పథకం
- కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయం

.. వివరాలు 3లో




# డిజిటల్ చెల్లింపులపై ఛార్జీలు

బిల్లుకు లోక్‌సభ ఆమోదం

.. వివరాలు 3లో

# విద్య వ్యాపార వస్తువుగా మారింది

- ఎల్‌కేజీకే లక్షల్లో ఫీజులు దండుకుంటున్నారు
- నిరుద్యోగం, ఫీజుల దోపిడీ, ప్రభుత్వ వ్యవస్థల నిర్వీర్యంపై పోరు
- క్యా బోల్తీ పబ్లిక్ పేరిట... దేశ వ్యాప్త పర్యటనలు
- ప్రెజర్ గ్రూపుగా పనిచేసేందుకే నిర్ణయం
- కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే

3



కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్' అంటే ప్రజలు ఏమంటున్నారు... పేరుతో కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగం, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రజల వద్దకు తీసుకెళ్తామని ఆయన తెలిపారు.


## ఆయుష్ వైద్య సేవల అభివృద్ధి కోసం రూ.257 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు

- జీరో వేకెన్సీ కింద ఖాళీల భర్తీ కోసం సీఎంతో చర్చిస్తా
- రూ.210 కోట్లతో ధర్మవరం, పిఠాపురంలలో ఆయుర్వేద వైద్య కళాశాలలు, ప్రొద్దుటూరులో యునాని కళాశాల ఏర్పాటుకు స్థల సేకరణ పూర్తి
- వైద్యుల సదస్సులో రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**విజయవాడ, నంబర్ వన్:** రాష్ట్రంలో ఆయుష్ శైద్య సేవల విస్తృతికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. ఈ క్రమంలోనే ఆయుష్ సేవల అభివృద్ధి కోసం 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 257 కోట్లు మంజూరు చేయాలని వార్షిక ప్రణాళిక కింద నేషన్ ఆయుష్ మిషన్ కు ప్రతిపాదన పంపించామని తెలిపారు. అలాగే వైద్యారోగ్య శాఖలో మాదిరిగానే ఆయుష్, ఫుడ్ సేఫ్టీ శాఖల్లో జీరో వేకెన్సీ కింద నియామకాలు చేపట్టేందుకు

మిగతా 2 లో



# యువత ఆందోళనలను అర్థం చేసుకోవాలి

## వారి నిరసనలో న్యాయం ఉందన్న మోహన్ భగవత్

జెన్-జీ యువత దేశ వ్యతిరేకులు కాదని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలు, వారు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు సమర్థనీయమైనవేనని పేర్కొన్నారు.

# గిరిజన హక్కుల పరిరక్షణలో రాజీ లేదు



మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేశారు. గిరిజనుల హక్కులకు భంగం కలిగించే ప్రభుత్వ చర్యలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు ఆదివాసీల తరపున బలమైన ప్రజాగొంతుకగా నిలవాలని పార్టీ ఎస్టీ సెల్ నాయ కులకు సూచించారు. వైఎస్సార్సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, డాక్టర్ తమర్భ నర్సింగ రావు దంపతులు గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాల యంలో జగన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ చట్టాల పరి రక్షణ, జీవో నంబర్–3 పునరుద్ధరణ, 1/70 చట్టంపై గిరిజనేతరులు దాఖలు చేసిన కేసులు. బాక్సైట్ తవ్వకాలకు అనుమతులు, హైడ్రో పవర్ ప్రాజెక్టులపై గిరిజనుల్లో నెలకొన్న ఆందోళన తదితర అంశాలను వారు జగన్కు వివరించారు.

## పోలీస్ పోస్టులు భర్తీ చేయాలి

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోలీస్ ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ విద్యార్థి, నిరుద్యోగ, యువజన జేఏసీ ప్రతినిధులు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ ను గురువారం పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. పోలీస్ శాఖలో దాదాపు 20 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిలో కనీసం 10 వేల పోలీస్ ఉద్యోగాలైనా వెంటనే భర్తీ చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఏపీఎస్ఈయూ జేఏసీ కన్వీనర్ ఎంబేటి రామచంద్ర ఆధ్వర్యంలో జేఏసీ ప్రతినిధులు జగన్ కు వినతిపత్రం అందజేశారు. అదే విధంగా అభ్యర్థుల వయోపరిమితిని 35 సంవత్సరాలకు పెంచేలా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని కోరారు. వీరి విజ్ఞప్తులపై సానుకూలంగా నిరుద్యోగ యువతకు వైసీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## జగన్ ను కలిసిన దేవరపల్లి హోటల్ నిర్వాహకులు

తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి హోటల్ నిర్వాహకులు వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం మాజీ ముఖ్యమంత్రి జగన్ ను కలిశారు. పొగాకు బోర్డు వేలం కేంద్రం పర్యటనలో జనం రద్దీ వల్లే తోపులాట జరిగిందని, దీంతో వైసీపీకి ఎలాంటి సంబంధం లేదని హోటల్ నిర్వాహకులు చందన వరలక్ష్మి, చందన దివ్య వివరించారు. పార్టీ కార్యకర్తలు తమ హోటల్ ధ్వంసం చేశారన్న ప్రచారంలో వాస్తవం లేదని, జగన్మోహన్రెడ్డి ప్రభుత్వంలోనే తమ కుటుంబం లబ్ధిపొందిందని స్పష్టం చేశారు.

# నీట్ శిక్షణ విద్యార్థి బలవన్మరణం

## హైదరాబాద్ బేగంపేటకు చెందిన వైష్ణవిగా గుర్తింపు

**విజయవాడ :** కృష్ణా జిల్లాలోని కానూరులో విషాదం చోటు చేసుకుంది. నీట్ శిక్షణ పొందుతున్న హైదరాబాద్ యువతి వైష్ణవి(19) బలవన్మరణానికి పాల్పడింది. హైదరాబాద్లోని బేగంపేటకు చెందిన వైష్ణవి నీట్ లాంగ్టర్మ్ కోచింగ్ కోసం కృష్ణా జిల్లాలోని శ్రీ భారతి ఇన్స్టిట్యూట్లో చేరింది. మూడు వారాల కిందటే అక్కడకు వచ్చిన వైష్ణవి.. కుటుంబానికి దూరంగా ఉండలేకపోయింది. ఇంత దూరంలో ఉండి చదవలేనంటూ తల్లిదండ్రులకు ఫోన్ చేసిన తన బాధను చెప్పుకుంది. అయితే బిడ్డ భవిష్యత్తు బాగుండాలని భావించిన తల్లిదండ్రులు.. వైష్ణవికి సర్దిచెప్పారు. ఇంతలోనే తాను ఉంటున్న హాస్టల్ గదిలో యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హాస్టల్ సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యువతి మృతి సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేయడంతో వారంతా హుటాహుటిన కృష్ణాజిల్లాకు చేరుకున్నారు. చదువు కోసం వెళ్లిన తమ బిడ్డ ఇలా విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అయితే, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కృష్ణా నీటి వాటాలు తేల్చండి

## బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని కోరిన ఏపీ

**అమరావతి :** కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఛైర్మన్కు ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది. కృష్ణా జలాల అంశంపై చర్చించేందుకు బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని రాష్ట్ర జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కోరారు. శ్రీశైలం, సాగర్లో అందుబాటులో ఉన్న నీటిలో ఏపీ, తెలంగాణ వాటాలు ఖరారు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎల్నినో ప్రభావం దృష్ట్యా నీటిని జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరముందని ఏపీ ప్రభుత్వం అభిప్రాయపడింది. రెండు రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరింది. నీటి వాటాల సింగిల్ పాయింట్ అజెండాతో సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. బోర్డు లేదా త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది.

# పరామర్శల పేరుతో రాష్ట్రంలో విధ్వంసం

మొదటి పేజీ తరువాయి



ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందన్నారు. 'దేవరపల్లిలో ఓ మహిళ చిరువ్యాపారం చేసుకుంటూ పొట్టపోసుకుంటుంటే ఆమె దుకాణాన్ని కూడా ధ్వంసం చేశారు. ప్రశాంతంగా ఉండే జిల్లాల్లోనూ శాంతిభద్రతల సమస్య సృష్టిస్తున్నారు. గొడ్డలి పార్టీ మీటింగ్ అంటే మందు తాగించడానికి లైసెన్స్ ఇచ్చినట్లు ఆ పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారు. జనాల్ని తాగించి తరలించుకొస్తున్నారు' అని దుయ్యబట్టారు. డీఎస్సీపై గొడ్డలి పార్టీ చేస్తున్న యాగీని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. డీఎస్సీపై ఏడాది తర్వాత ధర్నాలు చేయడం ఏమిటన్నారు. పారదర్శకంగా నిర్వహించామనే అసూయతో గొడ్డలి పార్టీ కుట్రలు పన్నుతోందని.. న్యాయస్థానాల్లో 300 పైచిలుకు కేసులు వేసింది. వాటిని కోర్టులు కొట్టేసి చీవాట్లు పెట్టినా ఆ పార్టీ నేతల తీరు మారడం లేదు. వారికి డీఎస్సీ రిజర్వేషన్లపై కనీస అవగాహన లేదు, అందుకే ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తున్నారు' అని ధ్వజమెత్తారు. ఇంకా ఏమన్నారంటే..

## అగ్రి బాధితులకు సత్వర న్యాయం..


అగ్రిగోల్డ్ బాధితులకు సత్వర న్యాయం చేయాలి. బాధితులకు ఆదుకోవడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అడ్డుకునేందుకు కొందరు న్యాయస్థానాలను ఆశ్రయుంచాలని చూస్తున్నారు. దీనిపై కఠినంగా ఉంటూ ఎక్కడికక్కడ అగ్రి ఆస్తులను సరైన రీతిలో వేలం పెట్టి బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా చూడాలి. వేలంపాటలో సరైన ధర రాకపోతే ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలి. అగ్రి గోల్డ్ వ్యవహారంపై క్యాబినెట్ సబ్ కమిటీ చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. బాధితులు సుమారు 8 రాష్ట్రాల్లో ఉన్నారు. 15 ఏళ్లుగా వారు న్యాయం కోసం ఎదురుచూస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలి. పొగాకు రైతులకు కూటమి ప్రభుత్వం చేస్తున్న లబ్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఆక్వా రైతులకు రూ.1100 కోట్లు విద్యుత్ సబ్సిడీగా ఇస్తున్నాం. ఆక్వా, నాన్ ఆక్వా జోన్లు అనే తేడా లేకుండా అందరికీ సబ్సిడీ అందిస్తున్నాం. ఆక్వా ఫీడ్ ఎక్స్పోర్టు 50 శాతం తగ్గించేందుకు కేంద్రం సానుకూలత వ్యక్తం చేసింది. ఈ నెలాఖరులో వెలిగొండ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేస్తాం. ఎల్నినో కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా రాష్ట్రంలో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడగలిగాం. ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పనిచేయడం ఎంత ముఖ్యమో ప్రజలతో అనుసంధానం కావడం కూడా అంతే ముఖ్యం. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రభుత్వం చేసే మంచిని వారికి వివరించాలి. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యానికి అనుగుణంగా మంత్రుల ప్రసంగాలు ఉండాలి. వారి ప్రసంగాల్లో స్వర్ణాంధ్ర విజన్ 2047 ప్రతిబింబించాలి. ఈ నెల 17 నుంచి నాలుగు రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయి. మళ్లీ డిసెంబరులో అసెంబ్లీ సమావేశాలు నిర్వహిద్దాం. క్వాంటమ్ వ్యాలీ ప్రారంభోత్సవం ఈ ఏడాది డిసెంబరులో గానీ, వచ్చే ఏడాది జనవరిలో గానీ జరుగుతుంది. భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవ ఘట్టాన్ని రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ సెంటిమెంట్గా ఫీల్ అయ్యారు. ఇది మనది అని సొంతం చేసుకున్నారు. గిరిజనులు తమ సంప్రదాయ థింసా నృత్యంతో తొలిసారి గిన్నిస్ రికార్డు సృష్టించడం గొప్ప ఘట్టం. ఈ నెల 13న రాజధానిలో సీడ్ యాక్సిస్ రహదారిని ప్రారంభిస్తాం. అమరావతిలో ఏర్పాటు చేయనున్న 'అమరావతి ఐ'.. దుబాయ్లో ఉన్న ఐ వీల్ కంటే పెద్దగా ఉంటే బాగుంటుంది. దుబాయ్లో ఉన్న ఐ వీల్ 250 మీటర్ల ఎత్తులో ఉంటుంది. (సీడ్ యాక్సిస్ రహదారి ప్రారంభోత్సవం ముగిశాక, ఎమ్మెల్యే కార్వర్ట్స తాళాలు సీఎంకి అప్పగిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. దసరా నాటికి మంత్రుల విల్లాలు పూర్తవుతాయన్నారు.)

## స్థానిక ఎన్నికల్లో మనదే పైచేయి కావాలి: లోకేశ్

మంత్రివర్గ సమావేశానికి ముందు సీఎం క్యాంపు కార్యాలయంలో లోకేశ్ మంత్రులతో జరిపిన బ్రేక్ఫాస్ట్ సమావేశంలో స్థానిక ఎన్నికలపై చర్చ జరిగింది. సెప్టెంబరు, అక్టోబరుల్లో ఈ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, అందుకు సన్నద్ధం కావాలని ఆయన సహచర మంత్రులకు స్పష్టం చేశారు. మెజారిటీ స్థానాలను కూటమి అభ్యర్థులు కైవసం చేసుకోవాలన్నారు. 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని వేగంగా.. ఎక్కువ ఇళ్లను చుట్టేయాలన్నది లక్ష్యంగా పెట్టుకోకుండా ప్రతి ఇంటి వద్దా వీలైనంత ఎక్కువ సమయం గడిపి వారికి ప్రభుత్వం పట్ల ఉన్న అభిప్రాయాలను తెలుసుకోవాలని, ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించాలని కోరారు. 'సర్' ముసాయిదా ఓటర్ల జాబితా వచ్చిందని.. అర్హులెవరైనా ఓట్లు కోల్పోయి ఉంటే తిరిగి చేర్పించడంపై నేతలు దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు.

# కేబినేట్ కీలక నిర్ణయాలు

మొదటి పేజీ తరువాయి



బిల్లు–2019, ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు–2024లను ఉపసంహరించి.. మరింత పటిష్ఠ చట్టాల రూపకల్పనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కేబినేట్ అనంతరం వివరాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. మున్సిపల్ భూముల లీజు గడువు పెంపునకు చట్టసవరణల ప్రతిపాదన, యూడీఏల పునర్వ్యవస్థీకరణకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. పాదచారుల భద్రత పాలసీ–2026, రెండు కొత్త ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు, కొత్త జిల్లాలకు 15 కొత్త డీఈవో పోస్టులు, అమరావతి క్యాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్కు రూ.1002.49 కోట్లు కేటాయింపునకు క్యాబినెట్ గ్రీన్సిగ్నల్ ఇచ్చింది. ట్విన్ టవర్స్ నిర్మాణ బాధ్యతలను ఎల్అండ్టీకి అప్పగించేందుకు అంగీకారం తెలిపింది. అసెంబ్లీ, హైకోర్టు డిజైన్ల కోసం అదనపు నిధులు, అమరావతి భూ కేటాయింపులపై జీవోఎం సిఫార్సులకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. 'అమరావతి ఐ' ప్రాజెక్టుకు రీ–టెండర్లకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏదుల ముస్తూరులో 19.55 ఎకరాలు ఎపిఐఐసికి బదిలీకి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు. తిమ్మసముద్రంలో 13.45 ఎకరాలు సియుడిఎకు బదిలీ చేసేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. కొత్త జిల్లాలకు అనుగుణంగా యుడిఎ పునర్వ్యవస్థీకరణకు మంత్రివర్గం అంగీకారం తెలిపిందని, వాటి సంఖ్య 21 నుంచి 23కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కండలేరు నుంచి పరిశ్రమల క్లస్టర్కు నీటి సరఫరాకు కేబినెట్ ఆమోద ముద్ర వేసిందన్నారు. విజయవాడ ఆటోనగర్ కాలనీవాసులకు జఆఃూ హక్కులను క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. 400 హౌసింగ్ యూనిట్ల భూ సమస్యకు కేబినెట్లో పరిష్కారం చూపామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ భూ వివాదాల పరిష్కారానికి సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. అమరావతి 'ఐ' ప్రాజెక్టుకు సవరించిన టెండర్లకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఎత్తైన అమరావతి ఐ నిర్మాణానికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించేందుకు కేబినెట్ అంగీకారం తెలిపిందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్కు 'ఆమ్నిబస్ చట్టం–2026' చట్టాన్ని తీసుకొచ్చామని, పెట్టుబడులకు అడ్డంకుల తొలగింపే ఆమ్నిబస్ చట్టం లక్ష్యమని పార్థసారథి స్పష్టం చేశారు. కుప్పం గ్రీన్ఫీల్డ్ ఎయిర్పోర్ట్ భూసేకరణకు ప్రత్యేక పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. డి–ఫామ్ లేని సాగుదారులకు ఎకరాకు రూ.12.44 లక్షల పరిహారం అందించేందుకు కేబినెట్ అంగీకారం తెలిపిందన్నారు. అమరావతిలో 47 అంతస్తుల ట్విన్ టవర్స్ నిర్మాణానికి ఆమోదం లభించిందని, ట్విన్ టవర్స్లో కార్పొరేట్, క్వాంటమ్ సంస్థలకు అవకాశం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. హైకోర్టు భవనం రీ–డిజైన్ ప్రతిపాదనకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఏపీ పిపిపి పాలసీ–2026కు మంత్రిమండలి నుంచి ఆమోదం ముద్ర పడినట్లు చెప్పారు. ఖఖఖ ప్రాజెక్టులకు రూ.1,500 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం సమావేశంలో నిర్ణయించినట్లు వెల్లడించారు. భారీ పెట్టుబడుల ఆకర్షణేలి కొత్త పిపిపి పాలసీ లక్ష్యమని తెలిపారు. మోతడకలో 2,344 ఎకరాల్లో ల్యాండ్ పూలింగ్కు ఆమోద ముద్ర పడిందన్నారు. హైస్పీడ్ రైలు, ఇన్నర్ రింగ్ రోడ్డుకు భూముల సమీకరణకు మంత్రివర్గం అంగీకారం తెలిపిందని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.

# నేడే నేతన్న సేవలో..

**చేనేత కార్మికుల ఖాతాల్లో రూ.25 వేలు**

**చీరాలలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం**

**రాష్ట్రంలోని 71,536 కుటుంబాలకు 179 కోట్లు**

**అమరావతి :** చేనేత కార్మిక కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ఎన్నికల హామీలకు అతీతంగా అమలు చేస్తున్న ఈ కొత్త పథకం ద్వారా అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి రూ.25వేల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తోంది. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 7న సీఎం చంద్రబాబు చీరాలలో ప్రారంభించబోతున్న ఈ పథకానికి 'నేతన్న సేవలో..' అని పేరు పెట్టారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన చేనేత జౌళి శాఖ 71,536మంది (కుటుంబానికి ఒకరు) చేనేత కార్మికుల్ని ఈ పథకానికి ఎంపిక చేసింది. శుక్రవారం వేటపాలెం మండలం కొత్తపేటలో పథకాన్ని ప్రారంభించి అర్హుల బ్యాంకు ఖాతాలో రూ.25వేల చొప్పున సీఎం జమ చేయనున్నారు. చేనేత రంగాన్ని బలోపేతం చేసే క్రమంలో ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఇది అదనం అని చేనేత జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో అర్హులైన చేనేత కార్మికుల్లో యాభై ఏళ్లు దాటిన 85వేల మంది నేతన్నలకు నెలకు రూ.4వేల చొప్పున పింఛను ఇస్తున్న కూటమి ప్రభుత్వం.. 62,541మంది చేనేతలకు నెలకు 200యూనిట్లతోపాటు 10,032మంది పవర్ లూమ్ కార్మికులకు 500యూనిట్లు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తోంది. మరోవైపు 109చేనేత సహకార సంఘాలకు రూ.79కోట్లతో క్యాష్ క్రెడిట్, హ్యాండ్లూమ్ పార్కులు, చేనేత మ్యూజియం, టెక్స్టైల్ రీసైక్లింగ్ యూనిట్ వంటి కార్యక్రమాలతో చేనేత రంగానికి ప్రభుత్వం ఊతమిస్తోంది. మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు, శాఖమూరులో చేనేత–హస్తకళల మ్యూజియం ఏర్పాటు చేస్తోంది.

# ఆయుష్ వైద్య సేవల అభివృద్ధి కోసం రూ.257 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడుతో చర్చిస్తామని వెల్లడించారు. నగరంలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో గురువారం ప్రభుత్వ ఆయుర్వేద, హోమియో, యునాని, సిద్ధ వైద్యులకు రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ జాతీయ ఆయుష్ కమిషన్ నుంచి వార్షిక ప్రణాళిక కింద నిధులు పొందడంలో ఆనాటి గత వైకాపా ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. 2024–25లో రూ.85 కోట్లు, 2025–26లో రూ.166 కోట్లు చొప్పున కూటమి ప్రభుత్వానికి మంజూరయ్యాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ భారీగా కేంద్రం నుంచి నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని చెప్పారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్లతో గుంటూరు సమీపంలో కేంద్ర యోగా, ప్రకృతి వైద్యానికి సంబంధించిన పరిశోధన సంస్థను ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం 15 ఎకరాలను కేటాయించిందని చెప్పారు. గత ప్రభుత్వం ఈ సంస్థ ఏర్పాటు కోసం కేటాయించిన భూమిని ఇళ్ల స్థలాలకు మళ్లించడంతో తదుపరి చర్యలు స్తంభించాయని విమర్శించారు. తిరుపతి, గిద్దలూరు, నందిగామ, తెనాలి, టెక్కలి, రంపచోడవరంలలో ఒక్కొక్కటి రూ. 15 కోట్లు చొప్పున వ్యయం చేసి సమగ్ర ఆయుష్ ఆసుపత్రులను ఏర్పాటు చేస్తామన్నారు. ధర్మవరం, పిఠాపురంలలో ఆయుర్వేద, ప్రొద్దుటూరులో యునాని వైద్య కళాశాలల ఏర్పాటుకు రూ.70 కోట్లు చొప్పున రూ.210 కోట్లు ఖర్చు చేయబోతున్నామని చెప్పారు. అలాగే విశాఖలోరూ.70 కోట్లతో తలపెట్టిన నేచురోపతి వైద్య కళాశాల నిర్మాణం పనులు ముగింపు దశకు చేరుకున్నాయని తెలిపారు. అలాగే ఆయుష్ ఆరోగ్య మందిరాలకు పూర్తిస్థాయిలో కొత్త భవనాలను నిర్మించే పనులు చివరిదశకు వచ్చాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు వివిధ హోదాల్లో కలిపి 216 మంది ఆయుష్



వైద్యులను నియమించిందన్నారు. ఆయుర్వేదంలోని శల్యతంత్ర, శాకల్యతంత్ర విభాగాలకు సంబంధించి 58 రకాల శస్త్ర చికిత్సలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చిందని మంత్రి తెలిపారు. సంబంధిత వర్గాలతో చర్చించి, ఈ చికిత్స విధానాలపై పూర్తి అవగాహన కల్పించిన తర్వాత అమలు చేస్తామని చెప్పారు. ఆయుష్కు ప్రాధాన్యతనివ్వడమంటే అల్లోపతి వైద్యాన్ని తగ్గించడం కాదని మంత్రి స్పష్టం చేశారు. అత్యవసర చికిత్స, శస్త్ర చికిత్సల్లో అల్లోపతి వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఉందని చెప్పారు. ఆహారపు అలవాట్లు, జీవన శైలిలో మార్పులు చేసుకోవడం, యోగా, ప్రకృతి వైద్య విధానాలను అవలంబించడం వల్ల వ్యాధులకు దూరంగా ఉండొచ్చని చెప్పారు. సదస్సు ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి జి.వీరపాండియన్ మాట్లాడతూ, ముగింపు కార్యక్రమంలో రోణంకి గోపాలకృష్ణ మాట్లాడుతూ ఆయుష్ వైద్య కేంద్రాలను ఎహెచ్ ఎంఐయస్ పోర్టల్ తో అనుసంధానం చేశామని, ఇప్పటికే 60,000 మంది రోగుల వివరాలను నమోదు చేశామన్నారు. రోగుల పేర్ల నమోదు మొదలుకొని మందుల పంపిణీ వరకు అన్ని సేవలను ఒక డిజిటల్ వేదికపై నిర్వహించేలా వ్యవస్థను పటిష్టం చేవామని చెప్పారు. గడచిన రెండేళ్లల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆయుష్ సేవలను మరింత బలోపేతం చేసేందుకు ఈ సదస్సు మరింత ఉపయోగపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఆయుర్వేద కొత్త వైద్య క

ళాశాలలు, ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేశామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ హోమియోపతి సలహాదారు డాక్టర్ ప్రీతా కిజక్కుట్టిల్ మాట్లాడుతూ హోమియో వైద్య శాలల్లో ఒకే విధమైన చికిత్సా ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఈ సదస్సులో ఆయుష్ అదనపు డైరెక్టర్లు శేఖర్, సాయిసుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ ధనుంజయరావు, ఇతర అధికారులు మాట్లాడిన వారిలో ఉన్నారు. ఆయుష్ వైద్యులు 550 మంది హాజరయ్యారు.

# విద్య వ్యాపార వస్తువుగా మారింది


**ఎల్‌కేజీకే లక్షల్లో ఫీజులు దండుకుంటున్నారు**
**నిరుద్యోగం, ఫీజుల దోపిడీ,**
**ప్రభుత్వ వ్యవస్థల నిర్వీర్యంపై పోరు**
**క్యా బోల్తీ పబ్లిక్ పేరిట... దేశ వ్యాప్త పర్యటనలు**
**ప్రెజర్ గ్రూపుగా పనిచేసేందుకే నిర్ణయం**
**కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే**



**ముంబై :** కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్' అంటే ప్రజలు ఏమంటున్నారు... పేరుతో కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగం, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రజల వద్దకు తీసుకెళ్తామని ఆయన తెలిపారు. విద్యార్థి నిరసనలతో దేశం దృష్టి ఆకర్షించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కీలక ప్రకటన చేసింది. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు 'క్యా బోల్తీ పబ్లిక్' పేరిట జాతీయస్థాయి ప్రచారం నిర్వహిస్తామని వెల్లడించింది. ప్రజల ఆందోళనలు, ఆకాంక్షలను అర్థం చేసుకోవడం, అభిప్రాయాలను తీసుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని స్పష్టం చేసింది. సెప్టెంబర్ నుంచి దేశవ్యాప్తంగా పర్యటించి ప్రతి ఒక్కరితోనూ మమేకమవుతామని తెలిపారు. సీజేపీ ఒక రాజకీయ పార్టీగా మారకుండా ఒక ఒత్తిడి బృందంగానే కొనసాగుతుందని దీప్కే ప్రకటించారు. మహారాష్ట్రలో నిర్వహించిన పార్టీ ప్రధాన బృంద సమావేశం అనంతరం దీప్కే ఈ ప్రకటన చేశారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశం లేదని, ప్రజల తరఫున ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చే ప్రెషర్ గ్రూప్‌గా పనిచేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. దేశ యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య, ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజులు, ప్రభుత్వ పాఠశాలల నాణ్యత, ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల్లో తగ్గుతున్న విశ్వాసం వంటి అంశాలపై ఉద్యమాన్ని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ ప్రచారంలో విద్యార్థులు, యువత, సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ రోజు మన దేశంలో సంస్థాగత జవాబుదారీతనం ప్రమాదకర స్థితిలో ఉంది. ఇది మన ప్రజాస్వామ్యానికి ఒక ప్రమాదకర సంకేతం. గతంలో ఓటర్లు ప్రభుత్వాన్ని ఎన్నుకునేవారు. ఈ రోజు ఎవరు ఓటు వేయాలో ప్రభుత్వమే నిర్ణయిస్తోంది. ప్రజాస్వామ్యం ఇలా పనిచేయదు. మనం ఎన్నికల సంఘం జవాబుదారీతనాన్ని సరిదిద్దాలి. మనం ఇది చేసేంత వరకు దేశంలో ఎన్నికల అవకతవకలు కొనసాగుతాయి' అని దీప్కే పేర్కొన్నారు. నిరుద్యోగం దేశంలో ఒక ప్రధాన సమస్య అని, దీనిని దేశవ్యాప్త సమస్యగా పరిగణిస్తామని దీప్కే తెలిపారు. భారతీయ కుటుంబాలకు నాణ్యమైన విద్య రోజురోజుకూ భారంగా మారుతోందని, అందుకే ఆ అంశంపైనే తొలుత తాము దృష్టిసారిస్తామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. సెప్టెంబర్ నుంచి ప్రజల్లోకి వెళ్తామని మీడియా వేదికగా తెలియజేశారు. ఒకటో తరగతికే ఫీజులు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలల్లో ఇంకా ఎక్కువే ఫీజులు ఉంటున్నాయి. మధ్యతరగతి కుటుంబాలు ఆ మొత్తాన్ని ఎలా భరిస్తాయి. ఈ ఖర్చుల వల్ల ప్రజలు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఆ భారం తగ్గాలని మా పార్టీ కోరుకుంటోంది. తల్లిదండ్రులు పిల్లలకు ఉన్నత విద్య అందించాలనుకున్నప్పుడు దానిని వారు భారంగా భావించకూడదు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చెప్పిన ప్రకారం.. విద్య ప్రాథమిక హక్కు. గత కొన్నేళ్లుగా అది ఒక వ్యాపారంగా మారిపోయిందని దీప్కే ఆందోళన వ్యక్తంచేశారు. తమ ప్రచారంలో పాల్గొనాలనుకునేవారు అధికారిక క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయాలని సూచించారు. ఆ క్యూఆర్ కోడ్‌లను మీడియా సమావేశంలో ప్రదర్శించారు. సభ్యత్వం పూర్తిగా ఉచితమని చెప్పారు. మోసపూరిత చెల్లింపు అభ్యర్థనల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవస్థలు ప్రజలకు జవాబుదారీగా ఉండేలా... ఒత్తిడి తెచ్చే సంస్థగా సీజేపీ పనిచేస్తుందని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. రాజకీయ పార్టీల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రజలు ఉదయం ఒక పార్టీకి ఓటేస్తే సాయంత్రంకల్లా మరో పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఆయన అన్నారు.

# యువత ఆందోళనలను అర్థం చేసుకోవాలి

## వారి నిరసనలో న్యాయం ఉందన్న మోహన్ భగవత్



**ముంబై :** జెన్-జీ యువత దేశ వ్యతిరేకులు కాదని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలు, వారు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు సమర్థనీయమైనవేనని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు అనేవి సంభాషణకు, సమస్యల పరిష్కారానికి దోహదపడే మార్గాలని ఆయన స్పష్టం చేశారు. ముంబైలో నిర్వహించిన ఐఐఎమ్‌యూఎన్ సమావేశంలో మోహన్ భాగవత్ పాల్గొన్నారు. అనంతరం జెన్-జీ, జెన్-ఆల్ఫా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మాట్లాడుతూ.. తమ కాలంలో పెద్దల మాటకు ప్రాధాన్యం ఇచ్చేవారమని, అయితే నేటి జెన్-జీ ప్రతి అంశానికి తార్కిక వివరణలు కోరుకుంటోందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశ్నించడం, తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం, నిరసనలు తెలియజేయడం ప్రజాస్వామ్య హక్కులేనని మోహన్ భాగవత్ చెప్పుకొచ్చారు. అయితే నిరసనలు చేపట్టేందుకు ప్రజాస్వామ్యంలో కొన్ని పద్ధతులు, నియమాలు ఉంటాయని యువత గుర్తించాలని సూచించారు. యువత ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకుంటూ వారితో నిరంతర సంభాషణ కొనసాగించడం అవసరమని మోహన్ భాగవత్ చెప్పారు. ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా వందకు పైగా నగరాల నుంచి దాదాపు 2 వేల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఇకపోతే స్వలింగ వివాహాలపై ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. స్వలింగ సంపర్కులు కూడా సమాజంలో భాగమేనని.. వారికి గౌరవప్రదంగా కలిసి జీవించే హక్కు ఉండాలని వ్యాఖ్యానించారు. అయితే అలాంటి బంధాన్ని 'వివాహం'గా పిలవకుండా.. కలిసి జీవించేందుకు ప్రత్యేక చట్టపరమైన వ్యవస్థను రూపొందించవచ్చని సూచించారు. . భారతీయ సంప్రదాయంలో వివాహ వ్యవస్థకు ప్రత్యేకమైన స్థానం ఉందని పేర్కొన్నారు. మన సంప్రదాయంలో వివాహం అనేది ఇద్దరు వ్యక్తులు కలిసి జీవించేందుకు ఏర్పడిన సౌకర్యం మాత్రమే కాదని.. అది కుటుంబ వ్యవస్థకు పునాది అన్నారు. కుటుంబం సమాజానికి మూల యూనిట్ అని.. మంచి పౌరులను తీర్చిదిద్దేది కుటుంబమేనని వివరించారు. సోషల్ మీడియా వినియోగంపై కూడా మోహన్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం చట్టాలు తీసుకురావడం వల్ల సమస్యలు పరిష్కారం కావని.. సమాజం తన దృక్పథాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 'సోషల్ మీడియాలో కనిపించే ప్రతి విషయాన్ని నిజమని నమ్మకూడదు. ప్రస్తుతం కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో నకిలీ వీడియోలు, తప్పుడు వ్యాఖ్యలు సృష్టించడం సాధ్యమవుతోంది. కాబట్టి అధికారిక వనరుల ద్వారా ధృవీకరించిన తర్వాతే సమాచారాన్ని నమ్మాలి. సోషల్ మీడియా వినియోగంలో ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు.

# తెహల్కా ఎడిటర్‌కు పదేళ్ల జైలు

**లైంగిక దాడి కేసులో శిక్ష ఖరారు చేసిన కోర్టు**
**రెండు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశం**
**తనపై కక్షసాధింపు చేపట్టారన్న తేజ్‌పాల్**



**ముంబై :** తెహల్కా మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు పదేళ్ల జైలు శిక్ష పడింది. 2013లో నమోదైన లైంగిక దాడి కేసులో బాంబే హైకోర్టు గోవా బెంచ్ కీలక తీర్పు వెలువరించింది. పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానా కూడా విధించింది. అతడు రెండు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించింది. 2013లో జూనియర్ సహోద్యోగినిపై అత్యాచారం చేసిన కేసులో తేజ్‌పాల్‌ను దోషిగా తేల్చిన బాంబే హైకోర్టు తాజాగా శిక్షను ఖరారు చేసింది. గతంలో ట్రయల్ కోర్టు ఈయనను నిర్దోషిగా ప్రకటించింది. ఆ తీర్పును బాంబే హైకోర్టు రద్దు చేసింది. 2013లో గోవాలో జరిగిన ఒక కార్యక్రమంలో హోటల్ లిఫ్ట్‌లో తనపై తేజ్‌పాల్ లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు ఆరోపించారు. దీంతో అదే ఏడాది నవంబర్‌లో అతడిని అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం 2021లో గోవా ట్రయల్ కోర్టు తేజ్‌పాల్‌ను నిర్దోషిగా ప్రకటించింది. అయితే ఆ తీర్పును గోవా ప్రభుత్వం బాంబే హైకోర్టులో సవాలు చేసింది. అప్పీల్‌ను విచారించిన హైకోర్టు ట్రయల్ కోర్టు తీర్పును కొట్టివేస్తూ తేజ్‌పాల్‌ను దోషిగా నిర్ధారించింది. పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. కాగా, ఈ కేసులో తానే బాధితుడినని తేజ్‌పాల్ పేర్కొన్నారు. తాను ఎలాంటి తప్పూ చేయలేదని, తాను నిర్దోషినని పేర్కొంటూ ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేస్తానని వెల్లడించారు. తీర్పు వెలువడిన అనంతరం మీడియాతో మాట్లాడిన తేజ్‌పాల్, 'నేను ఎలాంటి నేరమూ చేయలేదు. ఈ తీర్పుతో నేను ఏకీభవించడం లేదు. న్యాయం కోసం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాను' అని చెప్పారు. ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్, సురేంద్ర గాడ్లింగ్ లాగానే తానూ రాజకీయ కక్షసాధింపునకు గురయ్యానని తేజ్‌పాల్ పేర్కొన్నారు. తెహల్కా చేసిన దర్యాప్తు కథనాల వల్ల కొందరి రాజకీయ ప్రయోజనాలకు నష్టం కలిగిందని, అందుకే తనపై కేసు పెట్టారని ఆయన ఆరోపించారు. కోర్టు తీర్పు అనంతరం తరుణ్ తేజ్‌పాల్ మీడియాతో మాట్లాడారు. తనపై కొందరు గత 13 ఏళ్లుగా ప్రతీకారంతో రగిలిపోతున్నారని అన్నారు. ఈ కేసులో తనను పదిసార్లు నిర్దోషిగా ప్రకటించి విడుదల చేసే ఆధారాలు తన వద్ద ఉన్నాయని చెప్పారు. న్యాయవ్యవస్థపై తనకు పూర్తి విశ్వాసం ఉందని, దీనిపై త్వరలో సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్, భీమా కోరేగావ్ కేసులో అరెస్టైన సురేంద్ర గాడ్లింగ్ పేర్లను తేజ్‌పాల్ ప్రస్తావించారు. వారిలాగే తానూ రాజకీయ కక్షసాధింపునకు గురైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, విచారణ సందర్భంగా గోవా ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కీలక వాదనలు వినిపించారు. బాధితురాలు పలుమార్లు నిరాకరించినప్పటికీ తేజ్‌పాల్ వినలేదని, 'నో అంటే నో' అనే ప్రాథమిక సూత్రాన్నే ఆయన పట్టించుకోలేదని కోర్టుకు వివరించారు. నేర తీవ్రత దృష్ట్యా ఆయనకు గరిష్ఠ శిక్ష విధించాలని కోరారు. అయితే, తనకిప్పుడు 62 సంవత్సరాలని, తానూ బాధితుడినేనని నమ్ముతున్నానని కోర్టుకు తేజ్‌పాల్ విన్నవించారు. తనకు భార్య ఉందని, శిక్ష విషయంలో దయచేసి కనికరం చూపాలని కోరారు. విచారణ అనంతరం న్యాయస్థానం తన తీర్పులో కీలక వ్యాఖ్యలు చేసింది. తెహెల్కా ఎడిటర్-ఇన్-చీఫ్‌గా తేజ్‌పాల్ ఉన్న సమయంలో బాధితురాలు ఆయన కింద పని చేసిందని, వారి మధ్య అధికార అసమానత స్పష్టంగా ఉందని పేర్కొంది. ఆ వృత్తిపరమైన ఆధిపత్యాన్ని ఆయన దుర్వినియోగం చేశారని అభిప్రాయపడింది. ఈ సందర్భంగా బాధితురాలిపై జరిగిన అత్యాచారం నిజమేనని నిర్ధారించి తీర్పు వెలువరించింది. కాగా, గోవాలో 2013 నవంబర్ 7, 8 తేదీల్లో థింక్‌ఫెస్ట్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హోటల్ లిఫ్ట్‌లో తేజ్‌పాల్ తనపై రెండు సార్లు అత్యాచారం చేశాడని పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దాదాపు 13 ఏళ్ల తర్వాత కోర్టు అతనిని దోషిగా తేల్చింది.

# చేనేత ఉత్పత్తులు కొనండి

**నేతన్నలను ప్రోత్సహించండి.. వీడియోలు షేర్ చేయండి**
**ఇన్స్టా వీడియోలో ప్రధాని మోడీ పిలుపు**

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జాతీయ హస్తకళా దినోత్సవం సందర్భంగా హస్తకళా ఉత్పత్తులు కొనుగోలు చేయాలని, నేత కార్మికులకు మద్దతుగా వీడియోలు పంచుకోవాలని దేశ ప్రజలకు ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. ఆగస్టు 7న జాతీయ హస్తకళా దినోత్సవాన్ని స్నేహ దినోత్సవం లాగా అదే ఉత్సాహంతో జరుపుకోవాలని ఆయన కోరారు. భారతదేశపు నేత కుటు ంబాలకు మద్దతు ఇవ్వడానికి హస్తకళా ఉత్పత్తులు కొనుగోలు చేసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయాలని ఆయన పౌరులను కోరారు. ఇన్స్టాగ్రామ్లో పోస్ట్ చేసిన వీడియోలో దేశంలోని నేత కార్మికులను గౌరవించే అవకాశం ఇదేనని ప్రధానమంత్రి చెప్పారు. చాలా మంది నేత కార్మికులు చిన్న ఇళ్లలో పనిచేస్తూ వివిధ రకాల చేతితో నేసిన వస్త్రాలు తయారు చేస్తారని ఆయన పేర్కొన్నారు. కనీసం ఒక హస్తకళా ఉత్పత్తిని కొనుగోలు జేసి దానిని ప్రదర్శిస్తూ వీడియో తీసి ఆన్లైన్లో పం చుకోవాలని ఆయన ప్రోత్స హించారు. దీని ద్వారా ఇతరులను కూడా ఈ రంగానికి మద్దతు ఇచ్చేలా ప్రేరేపించవచ్చని ఆయన అన్నారు. మన లక్ష్యం ఆత్మనిర్భర భారత్ను నిర్మించడమే. దానికోసం చిన్న చిన్న, పేదకుటుంబాలు కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందాలి అని ప్రధానమంత్రి మోడీ అన్నారు. ప్రజల మద్దతు పెరిగితే భార తీయ నేత కార్మికుల ప్రతిభను, నైపుణ్యాన్ని ప్రపంచానికి చూపించవచ్చని ఆయన అన్నారు.. ఎదురుగా టేబుల్ మీద వివిధ రంగుల్లో ఉన్న చేనేత కండువాల ముందు నిలబడి ఈ వీడియో సందేశం ఇచ్చారు. అందులో ఒక కండువాని భుజం మీద వేసుకుని మరీ మాట్లాడారు. ప్రధాని మోడితన సందేశంలో జెనీ భాష వాడారని ఆ వీడియో విన్నవారు కామెంట్లు పెట్టారు.

# బయో గ్యాస్ ఉత్పత్తికి ప్రోత్సాహం

**రూ.23,731 కోట్ల గోబర్ధన్ పథకం.. కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయం**

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన గురువారం కేంద్ర మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు ప్రధాని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు కేంద్ర కేబినెట్‌లో ప్రధాని మోదీ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బయోగ్యాస్ ఉత్పత్తిని ప్రోత్సహించాలని నిర్ణయించారు. రూ.23,731 కోట్ల 'గోబర్ధన్' జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 2026-27 నుంచి 2035-36 వరకు కేంద్రం అమలు చేయనుంది. వ్యవసాయ అవశేషాలు, పశువుల పేడ, సేంద్రీయ వ్యర్థాలతో కంప్రెస్డ్ బయోగ్యాస్ (అఃఉ) ఉత్పత్తి చేయనుంది. దేశీయ అఃఉ ఉత్పత్తిని దాదాపు పది రెట్లు పెంచడమే లక్ష్యమని కేంద్ర మంత్రులు తెలిపారు. దిగుమతి సహజవాయువుపై ఆధారాన్ని తగ్గించి ఇంధన భద్రతకు బలం చేకూర్చనుందని వెల్లడించారు. రైతులు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు, సహకార సంఘాలకు కొత్త ఆదాయ అవకాశాలు వస్తాయని మంత్రులు పేర్కొన్నారు. అస్సాంలో నాలుగు లేన్ల నేషనల్ హైవేకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రూ.8,970 కోట్లతో అస్సాంలో నేషనల్ హైవే నిర్మించాలని మంత్రులు ఆమోదించారు.

# డిజిటల్ చెల్లింపులపై ఛార్జీలు

**బిల్లుకు లోక్‌సభ ఆమోదం**

**న్యూఢిల్లీ :** యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ సహా కొన్ని డిజిటల్ చెల్లింపు విధానాలపై ఛార్జీలు విధించే అవకాశాన్ని కల్పించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్-2007లో సవరణలు చేసే ఈ బిల్లు ద్వారా బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలకు కొన్ని ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాలపై రుసుములు వసూలు చేసే అవకాశం కల్పించనున్నారు. లోక్‌సభ ఆమోదించిన సవరణ బిల్లు ప్రకారం.. కేంద్ర ప్రభుత్వం నోట్గి÷ చేసే కొన్ని ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాలపై బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు ఛార్జీలు వసూలు చేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఎలక్ట్రానిక్ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ వసూలు చేయకుండా ఉన్న నిబంధనలో మార్పులు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను నిర్వహిస్తున్న బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు, మౌలిక సదుపాయాల సంస్థలకు స్థిరమైన ఆదాయ మార్గాన్ని కల్పించడమే ఈ మార్పుల ఉద్దేశమని ప్రభుత్వం చెబుతోంది. వినియోగదారులు, చిన్న వ్యాపారులపై పెద్ద భారం పడకుండా చిన్న మొత్తంలో రుసుములు విధించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభలో ఈ బిల్లును చర్చ లేకుండానే ఆమోదించారు. ప్రస్తుతం ఐఖఎ వంటి డిజిటల్ చెల్లింపు విధానాలపై ఎలాంటి ఛార్జీలు లేవు. అయితే ప్రతిపాదిత చట్ట సవరణలతో కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా నిర్ణయించే కొన్ని ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాలపై ఛార్జీలు విధించే అవకాశం ఉంటుంది.

# మెటా తీరుపై మండిపడ్డ కేజ్రీవాల్

**ప్రధాని మోడీ ఒత్తిళ్లకు తలొగ్గద్దని సూచన**

**న్యూఢిల్లీ :** ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటాపై ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్‌లో తన ఖాతాను ఎందుకు నియంత్రించారని ఆయన ప్రశ్నించారు. తన అకౌంట్ నియంత్రణపై మెటా అధికారులను ప్రశ్నిస్తే సరిగా సమాధానం ఇవ్వడం లేదని, ఈమెయిల్ పంపినా కూడా స్పందించడం లేదన్నారు. ప్రధాని మోదీ ఒత్తిళ్లకు తలగొద్దని మోటా సంస్థకు కేజ్రీవాల్ సూచించారు. తన సోషల్ మీడియా ఖాతాను భారత్‌లో ఎందుకు నిలిపివేశారో సంస్థ నుంచి ఎలాంటి స్పష్టత రాలేదని కేజ్రీవాల్ మండిపడ్డారు. మెటా ఇండియా కార్యాలయంలో మౌఖికంగా విచారించినా ఎలాంటి సరైన సమాధానం రాలేదని, తాము పంపిన ఈమెయిల్స్‌కు సాధారణ రసీదులు మాత్రమే వస్తున్నాయని ఆరోపించారు. ఇది చాలా చెత్త సేవ అంటూ అసహనం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి ఒత్తిళ్లకు తలవంచకండి.. లేదంటే భవిష్యత్తులో దేశంలో ప్రధాని ఖాతా ఒక్కటే నడుపుకోవడానికి మిమ్మల్ని అనుమతిస్తారు' అంటూ ఆయన ఎద్దేవా చేశారు. మెటా సంస్థ తన సేవలను మరింత బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని కేజ్రీవాల్ అన్నారు. కాగా, దేశంలో మెటా సంస్థపై ప్రస్తుతం తీవ్రస్థాయిలో ప్రభుత్వ నిఘా, విచారణ కొనసాగుతున్న తరుణంలో కేజ్రీవాల్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

# అరుణాచల్ ప్రదేశ్‌లో భూప్రకంపనలు

**రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 5.1గా నమోదు**

**ఇటానగర్ :** అరుణాచల్‌ప్రదేశ్‌లోని అప్పర్ సియాంగ్ జిల్లాలో గురువారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కెల్‌పై దాని తీవ్రత 5.1గా నమోదయింది. ఈ భూకంపం వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం కానీ జరగలేదని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ వెల్లడించింది. ఈ రోజు తెల్లవారుజాము 5.45 గంటలకు అప్పర సియాంగ్ జిల్లాలోని పాంగిన్‌కు 116 కిలో మీటర్ల దూరంలో.. 11 కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు వివరించింది. అయితే ఈ భూకంపానికి ముందు మూడు చిన్న ప్రకంపనలు చోటు చేసుకున్నాయని పేర్కొంది. అవి ఉదయం 3.40 గంటలకు 5 కిలోమీటర్ల లోతులో 2.8 తీవ్రతతో ఒకటి.. దీని తర్వాత 3.55 గంటలకు 3.2 తీవ్రతతో మరొకటి వచ్చిందని వివరించింది. అలాగే ఉదయం 4.34 గంటలకు 2.8 తీవ్రతో ఇంకొకటి వచ్చిందని తెలిపింది. పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని అధికారులు తెలిపారు. రోవైపు ఇదే రాష్ట్రంలోని షి యోమి జిల్లాలో బుధవారం భూకంపం సంభవించింది. ఇది 5.0 తీవ్రతతో వచ్చింది. ఈ జిల్లాకు ఈశాన్యంగా 60 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం నమోదైంది. ఇక్కడ కూడా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. దేశంలోని ఈశాన్య ప్రాంతం భూకంపం జోన్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ ప్రాంతంలో తరచూ అత్యధికంగా భూ ప్రకంపనలు జరుగుతున్నాయి.

నంబర్ వన్
NUMBER ONE Telugu Daily

# డీఎస్సీ అవకతవకలపై వైఎస్సార్‌సీపీ ఆందోళనలు

## జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో రిలే నిరాహార దీక్షలు





**విశాఖపట్నం, నంబర్ వన్:** డీఎస్సీ--2025 నియామకాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై సీబీఐతో విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో గురువారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. భీమిలి, విశాఖపట్నం ఉత్తరం, తూర్పు, దక్షిణ, గాజువాక నియోజకవర్గాల్లో నిర్వహించిన దీక్షల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన ఈ ఆందోళనల్లో డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఉత్తర నియోజకవర్గంలోని సత్యం జంక్షన్‌లో జరిగిన దీక్షలో జిల్లా పార్టీ అధ్యక్షుడు కె.కె. రాజు పాల్గొని సంఘీభావం తెలిపారు. డీఎస్సీ ఫలితాల అనంతరం నిబంధనలు మార్చడం వల్ల అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ, ఈ వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. భీమిలి నియోజకవర్గంలోని ఆనందపురం జంక్షన్‌లో జరిగిన కార్యక్రమంలో సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) మాట్లాడుతూ డీఎస్సీ--2025 నియామకాలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. స్పోర్ట్స్ కోటా అమలుపై అనేక సందేహాలు ఉన్నాయని, అర్హతల విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గాజువాక నియోజకవర్గంలోని పెదగంట్యాడ జంక్షన్‌లో నిర్వహించిన దీక్షలో సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి మాట్లాడుతూ డీఎస్సీ నియామక ప్రక్రియలో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. పరీక్షల నిర్వహణ, మెరిట్ జాబితాలు, స్పోర్ట్స్ కోటా అమలుపై వ్యక్తమైన అభ్యంతరాలపై స్వతంత్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తూర్పు నియోజకవర్గంలోని ఇసుకతోట జంక్షన్‌లో జరిగిన దీక్షలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు తదితరులు పాల్గొన్నారు. డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసి నిరుద్యోగ భృతి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. దక్షిణ నియోజకవర్గంలోని జీవీఎంసీ గాంధీ పార్క్ వద్ద మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేసిన నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ విధానాలను విమర్శించారు. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు స్పష్టం చేశారు.

# మధ్యవర్తిత్వంతో సామరస్య సమాజ నిర్మాణం సాధ్యం

## 12వ అదనపు జిల్లా జడ్జి లలాష్ పెదగాడి

### ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహణ




**శ్రీకాళహస్తి, నంబర్ వన్:** మధ్యవర్తిత్వం ద్వారా సామరస్య సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని 12వ అదనపు జిల్లా జడ్జి లలాష్ పెదగాడి పిలుపునిచ్చారు. హైకోర్టు ఆదేశాల మేరకు "మిడియేషన్ ఫర్ ది నేషన్ డ్రైవ్" కార్యక్రమంలో భాగంగా కోర్టు ఆవరణ నుంచి గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 12వ అదనపు జిల్లా జడ్జి లలాష్ పెదగాడి, సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల, న్యాయవాదులు, మధ్యవర్తిత్వ నిపుణులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ, న్యాయస్థానాలపై పెరుగుతున్న భారం తగ్గించేందుకు, వివాదాలను పరస్పర చర్చల ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు మధ్యవర్తిత్వ విధానం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. కోర్టుల వెలుపల తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో, పరస్పర అంగీకారంతో సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఈ విధానంలో ఉంటుందని వివరించారు. మధ్యవర్తిత్వం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన పెంపొందించాలని, సామరస్య సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

# మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ

## డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి : మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



**నాయుడుపేట, నంబర్ వన్:** డీఎస్సీ--2025 నియామకాలలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య డిమాండ్ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సూచనలతో నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం చేపట్టిన రిలే నిరాహార దీక్షలను కిలివేటి సంజీవయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మెగా డీఎస్సీ పేరుతో ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని, ఇది మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ" అని విమర్శించారు. స్పోర్ట్స్ కోటా పేరుతో అర్హులకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ, డీఎస్సీ నియామకాలపై స్వతంత్రంగా సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ వ్యవహారంలో బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే పదవికి రాజీనామా చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. డీఎస్సీ నియామకాలలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై చర్యలు తీసుకునే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు బిరుదవోలు శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తంబిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి, నాయుడుపేట పట్టణ అధ్యక్షుడు కలికి మాధవ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, జిల్లా, మండల స్థాయి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కూటమిలో జనసేనకు గుర్తింపు కొరవడిందా?

## అంతర్గత అసంతృప్తిపై పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ

### చెంగాళమ్మ ఆలయ అభివృద్ధి కమిటీలో చోటు దక్కలేదనే అసంతృప్తి?

### అధికారికంగా స్పందించని జనసేన నాయకత్వం



**సూళ్లూరుపేట, నంబర్ వన్:** జనసేన పార్టీలో అంతర్గత అసంతృప్తి నెలకొన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పనిచేస్తున్న మండల అధ్యక్షుడి వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారనే ప్రచారం స్థానికంగా సాగుతోంది. కూటమి ప్రభుత్వంలో జనసేనకు తగిన ప్రాధాన్యం, గుర్తింపు లభించడం లేదనే భావన కొందరు నాయకుల్లో వ్యక్తమవుతోందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవల ఏర్పాటు చేసిన శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయ అభివృద్ధి కమిటీలో జనసేన ప్రతినిధులకు అవకాశం కల్పించకపోవడం కూడా అసంతృప్తికి కారణమై ఉండవచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాలు సూళ్లూరుపేట రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి. మండల అధ్యక్షుడి తదుపరి నిర్ణయం, ఆయన వెంట మరికొందరు నాయకులు పార్టీని వీడతారా లేదా అనే అంశంపై స్థానిక రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. అయితే పార్టీ వీడుతున్నారనే ప్రచారం, కూటమిలో గుర్తింపు అంశంపై వ్యక్తమవుతున్న అసంతృప్తిపై జనసేన పార్టీ నాయకత్వం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అధికారిక స్పందన వెలువడిన తర్వాతే ఈ ప్రచారంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# యూరియా కొరత నివారించాలి

## వ్యవసాయ శాఖకు కాంగ్రెస్ వినతిపత్రం



శ్రీకాళహస్తి, నంబర్ వన్: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు యూరియా కొరత లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్ రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌లో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సకాలంలో యూరియా నిల్వలు అందుబాటులో ఉంచి, రైతులకు అవసరమైన ఎరువులు సులభంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు విధానాలపై సూచనలు ఇవ్వాలని, పంట నష్టాలను నివారించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కరీముల్లా, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సీతారాం, శ్రీకాళహస్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి, నాగరాజు, షాన్ మైఖేల్, చరణ్ పాల్గొన్నారు.

# శాకంబరీ అలంకారంలో చెంగాళమ్మ దివ్య దర్శనం





**సూళ్లూరుపేట, నంబర్ వన్:** పట్టణంలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి దేవి ఆలయంలో ఆషాఢ బహుళ అష్టమి సందర్భంగా అమ్మవారు శాకంబరీ అలంకారంలో భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు. పలు రకాల కూరగాయలు, పండ్లతో అత్యంత వైభవంగా అలంకరించిన అమ్మవారి రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈ శాకంబరీ అలంకారానికి ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్--కోమలి దంపతులు, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ--సింధు దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. వారు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు, దేవస్థాన అధికారులు ఉభయ దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తిరుమూరు సుధాకర్ రెడ్డి, కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు, తాగునీటి సౌకర్యం తదితర ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు వరం.. 'పీఎం-రాహత్' పథకం

## జిల్లా అదనపు ఎస్పీ మోహనరావు



**అనకాపల్లి, నంబర్ వన్:** రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ నగదు రహిత వైద్యం అందించే కేంద్ర ప్రభుత్వ 'పీఎం-రాహత్' పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ ఎల్. మోహనరావు సూచించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి జి. మనోహర్, ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ స్వప్న, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, పోలీసు, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితులకు రూ.1.50 లక్షల వరకు పూర్తిగా నగదు రహిత వైద్యం అందిస్తారని, ప్రమాదం జరిగిన నాటి నుంచి వరుసగా ఏడు రోజుల పాటు ఉచిత చికిత్స లభిస్తుందని తెలిపారు. ప్రమాదం జరిగిన తొలి గంట (గోల్డెన్ అవర్) అత్యంత కీలకమని, బాధితులను 24 గంటలలోపు గుర్తింపు పొందిన ఆస్పత్రికి తరలించి 100, 112 లేదా 108 అత్యవసర సేవలను వినియోగించాలని సూచించారు. ప్రమాద బాధితులను సమయానికి ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన లిగుడ్ సమారిటన్ (రహ్-వీర్)లిలకు ప్రభుత్వం రూ.25 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తుందని, వారికి ఎలాంటి పోలీసు లేదా చట్టపరమైన ఇబ్బందులు ఉండవని వివరించారు. పథకం సమర్థ అమలుకు 'పీఎం-రాహత్' పోర్టల్, యాప్ వినియోగం, ఆస్పత్రులు, పోలీసు శాఖ, రవాణా శాఖల మధ్య సమన్వయంపై సమావేశంలో అధికారులకు మార్గదర్శకాలు అందించారు. జిల్లా పరిధిలోని 8 ప్రభుత్వ, 5 ప్రైవేట్ ఆస్పత్రులతో పాటు విశాఖపట్నంలోని అనుబంధ ఆస్పత్రులు కలిపి మొత్తం 43 గుర్తింపు పొందిన ఆస్పత్రుల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రమాద బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ మానవత్వంతో స్పందించాలని, పీఎం-రాహత్ పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులు పిలుపునిచ్చారు.

# రూ.42 లక్షలతో మన్నారుపోలూరు జడ్పీ పాఠశాలకు ఆధునిక వసతులు



**శ్రీసిటీ, నంబర్ వన్:** సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించే లక్ష్యంతో రూ.42 లక్షల వ్యయంతో చేపట్టిన మౌళిక వసతుల అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించారు. శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో ఎయిసన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా ఈ పనులను చేపట్టింది. ఈ ప్రాజెక్టు కింద నూతన గ్రంథాలయ భవనం నిర్మాణం, తరగతి గదుల మరమ్మతులు, ఆర్వో తాగునీటి ప్లాంట్ ఏర్పాటు, భద్రతా గ్రిల్స్, ఫర్నిచర్ అందజేత, పాఠశాల ఆవరణలో పచ్చదనం పెంపు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎయిసన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ యసునోరి సకౌయే, ప్లాంట్ హెడ్ యుయిచా టోమిటా, శ్రీసిటీ ఫౌండేషన్ సీఎస్ఆర్ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ పాల్గొని నూతన వసతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా యసునోరి సకౌయే మాట్లాడుతూ, శ్రీసిటీ పరిసర ప్రాంతాల అభివృద్ధికి తమ సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా నిరంతరం సహకారం అందిస్తోందన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజాభివృద్ధికి తోడ్పడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శ్రీసిటీ ఫౌండేషన్ సీఎస్ఆర్ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి మాట్లాడుతూ, పరిశ్రమల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులను మెరుగుపరుస్తూ విద్యార్థుల నమోదు, విద్యా ఫలితాల పెరుగుదలకు కృషి చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్య, సుస్థిర అభివృద్ధి రంగాల్లో సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని చెప్పారు. జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలకు ఆధునిక వసతులు కల్పించిన ఎయిసన్ ఇండియా సంస్థను అభినందించారు. సత్యవేడు, వరదయ్యపాలెం, సూళ్లూరుపేట, తడ మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి శ్రీసిటీ ఫౌండేషన్, పరిశ్రమలు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ రెడ్డి ఎయిసన్ ఇండియా సంస్థకు, శ్రీసిటీ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకోగా, ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, శ్రీసిటీ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# 15 రోజులు గడిచినా విధుల్లో చేరని సిబ్బంది

**మున్సిపాలిటీలో బదిలీలపై సందిగ్ధం**

**కమిషనర్ ఆదేశాలు అమలవుతున్నాయా?**

**ఉద్యోగుల గైర్హాజరుపై పట్టణంలో చర్చ**




**సూళ్లూరుపేట, నంబర్ వన్:** మున్సిపాలిటీలో ఇటీవల జారీ చేసిన సిబ్బంది బదిలీ ఉత్తర్వుల అమలుపై సందిగ్ధ పరిస్థితులు నెలకొన్నాయి. బదిలీలు జరిగి 15 రోజులు దాటినా కొందరు రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఇప్పటికీ కొత్త విధుల్లో చేరలేదనే సమాచారం స్థానికంగా చర్చనీయాంశమైంది. మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య బదిలీ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, కొందరు ఉద్యోగులు వాటిని అమలు చేయకుండా పాత పోస్టులోనూ, కొత్త పోస్టులోనూ విధులు నిర్వహించడం లేదని ప్రచారం సాగుతోంది. దీంతో సంబంధిత సిబ్బంది ప్రస్తుతం ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారనే అంశంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విధులకు హాజరుకాకపోతే వారి హాజరు నమోదును ఎవరు పర్యవేక్షిస్తున్నారు? జీతాలు ఎలా విడుదల అవుతున్నాయి? అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ప్రజాధనంతో వేతనాలు పొందుతున్న ఉద్యోగులు విధులకు దూరంగా ఉంటే బాధ్యత ఎవరిదనే చర్చ పట్టణంలో జరుగుతోంది. మరోవైపు, కొందరు ఉద్యోగులు రాజకీయ స్థాయిలో బదిలీలను నిలిపివేయించే ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం కూడా వినిపిస్తోంది. దీంతో మున్సిపల్ పరిపాలనపై రాజకీయ ప్రభావం ఉందా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. బదిలీ అయిన సిబ్బంది విధుల్లో చేరకపోవడంతో ప్రజలకు అందాల్సిన కొన్ని సేవల్లో జాప్యం ఏర్పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యను వివరణ కోరగా, ప్రస్తుతం ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో కొంతమంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉద్యోగుల జీతాల చెల్లింపులో ఎలాంటి అక్రమాలకు అవకాశం లేదని స్పష్టం చేశారు. సంబంధిత శాఖల హెచ్‌వోడీలు డ్యూటీ సర్టిఫికెట్లు సమర్పించిన అనంతరమే వేతనాలు విడుదల అవుతాయని, నిబంధనల ప్రకారమే అన్ని చెల్లింపులు జరుగుతున్నాయని వివరించారు. బదిలీలకు సంబంధించిన పరిపాలనా చర్యలు కొనసాగుతున్నాయని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపల్ సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు. అయితే బదిలీ ఉత్తర్వుల అమలు, విధులకు గైర్హాజరవుతున్న సిబ్బందిపై తీసుకునే చర్యలపై స్పష్టత రావాల్సి ఉంది.

## 50 శాతం సబ్సిడీతో రైతులకు జీలగలు, పిల్లిపెసర్ల పంపిణీ



**తొట్టంబేడు, నంబర్ వన్:** మండల పరిధిలోని ఇలగనూరు సచివాలయంలో రైతులకు 50 శాతం సబ్సిడీపై జీలగలు, పిల్లిపెసర్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, కూటమి ప్రభుత్వ ఆదేశాలు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గాలి మురళి నాయుడు మాట్లాడుతూ, ప్రభుత్వం రైతుల కోసం అందిస్తున్న రాయితీ పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని సచివాలయాల పరిధిలో అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ అధికారి పవన్, పవిత్ర, ఇనాయతుల్లా, మాజీ సర్పంచ్ మధు నాయుడు, మహిళా నాయకురాలు గీత, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకయ్యతో పాటు పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ఆడి కృతిక మహోత్సవంలో భక్తులకు చల్లటి మజ్జిగ పంపిణీ

**టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్ మిత్రబృందం సేవా కార్యక్రమం**



**శ్రీకాళహస్తి, నంబర్ వన్:** విజ్ఞానగిరిపై వెలసిన శ్రీ కుమారస్వామి ఆలయంలో ఆడి కృతిక మహోత్సవం సందర్భంగా తెలుగుదేశం పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్ మిత్రబృందం ఆధ్వర్యంలో భక్తులకు చల్లటి మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి ఏడాది ఆడి కృతిక మహోత్సవం సందర్భంగా యువత "సేవే మార్గం--సేవే లక్ష్యం" అనే నినాదంతో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. భక్తి భావంతో యువత సమాజ సేవలో భాగస్వాములు కావడం ద్వారా భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు భావితరాలకు చేరుతాయని పేర్కొన్నారు. అధికారులు, పోలీసుల సమన్వయంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు, దర్శన ఏర్పాట్లు సమర్థంగా నిర్వహించడం ప్రశంసనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గురప్ప శెట్టి, కుమారస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు బాలు ఢిల్లీబాబు, కంటా సుబ్బు, కోరా రాకేష్, బాబు నాయుడు, నాగరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## మైనర్‌పై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

**విశాఖపట్నం క్రైమ్, నంబర్ వన్:** గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి విశాఖపట్నం ప్రత్యేక పోక్సో కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడు కోరిబిల్లి కృష్ణ కుమార్ (22)కు రూ.25 వేల జరిమానా విధించిన కోర్టు, అందులో రూ.20 వేలును బాధితురాలికి చెల్లించాలని ఆదేశించింది. అదనంగా ప్రభుత్వం బాధితురాలికి రూ.1 లక్ష నష్టపరిహారం అందజేయాలని పేర్కొంది. పోలీసుల వివరాల ప్రకారం, 2024 ఏప్రిల్ 20న గాజువాకలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి బాధిత బాలిక తల్లి మే 7న ఫిర్యాదు చేశారు. తన చిన్న కుమార్తెను ఇంట్లో ఒంటరిగా ఉంచిన సమయంలో, పెద్ద అల్లుడు అయిన నిందితుడు బాలికను బలవంతంగా లోపలికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. విషయం బయటకు చెబితే చంపేస్తానంటూ బాలికను బెదిరించినట్లు తెలిపారు. అనంతరం బాలికకు రక్తస్రావం కావడంతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స అందించగా, వైద్యుల పరీక్షల్లో లైంగిక దాడికి గురైనట్లు నిర్ధారణ అయింది. దీంతో బాధితురాలు జరిగిన విషయాన్ని తల్లికి వెల్లడించగా, ఆమె ఫిర్యాదు మేరకు గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి, అనంతరం మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసి దర్యాప్తు చేపట్టారు. కేసులో సమర్పించిన సాక్ష్యాధారాలు, వైద్య నివేదికలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన విశాఖపట్నం ప్రత్యేక పోక్సో కోర్టు నిందితుడిని దోషిగా తేల్చి, భారతీయ శిక్షాస్మృతి సెక్షన్లు 376తో పాటు పోక్సో చట్టంలోని సంబంధిత నిబంధనల కింద 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.25 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. అలాగే బాధిత బాలికకు ప్రభుత్వం ద్వారా రూ.1 లక్ష నష్టపరిహారం అందించాలని కోర్టు ఆదేశించింది.

## ఒత్తిడిపై విజయం.. సేవల్లో నాణ్యతకు నాంది

**విజయవంతంగా స్ట్రెస్ మేనేజ్‌మెంట్ 11వ సెషన్**



**విజయవాడ, నంబర్ వన్:** మానవ వనరుల అభివృద్ధి – ప్రత్యేక సామర్థ్య నిర్మాణ (కెపాసిటీ బిల్డింగ్) సెషన్లలో భాగంగా గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. సైకాలజిస్టులు డా. జి.శంకర్ రావు, డా. టీఎస్ రావు, డా. బి.పవన్ కుమార్, డా. బి.నవితశ్రీ, డా. హరిత బృందం రోజువారీ విధుల నిర్వహణలో ఒత్తిడిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఉద్యోగ జీవితంలో ఒత్తిడి సహజమైనదే అయినప్పటికీ, దానిని సమర్థవంతంగా నిర్వహించుకోవడం ద్వారా వ్యక్తిగత పనితీరుతో పాటు ప్రజలకు అందించే సేవల నాణ్యతను కూడా గణనీయంగా మెరుగుపరచవచ్చని నిపుణులు పేర్కొన్నారు. ఆకస్మిక పరిస్థితుల్లో ఆందోళనకు గురికాకుండా పనులకు ప్రాధాన్యత క్రమాన్ని నిర్ణయించడం, సమయానుకూలంగా విరామాలు తీసుకోవడం, సానుకూల దృక్పథాన్ని అలవరచుకోవడం, అవసరమైనప్పుడు మానసిక ఆరోగ్య నిపుణుల సలహా తీసుకోవడం ద్వారా ఒత్తిడిని సమర్థంగా అధిగమించవచ్చని వివరించారు. ఒత్తిడి లక్షణాలను ముందుగానే గుర్తించి వాటికి తగిన పరిష్కారాలను అనుసరించడం, సీనియర్ల సూచనలను విమర్శగా కాకుండా పనితీరును మెరుగుపరచుకునే అవకాశంగా స్వీకరించడం ఉద్యోగుల్లో మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. సమతుల్య ఆలోచన, సమర్థ సమయ నిర్వహణ, సానుకూల దృక్పథమే ఒత్తిడి రహిత పని సంస్కృతికి, నాణ్యమైన ప్రజాసేవలకు బలమైన పునాదులని పేర్కొన్నారు. సిబ్బందిలో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత పనితీరు, సమస్య పరిష్కార నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, డిజిటల్ స్కిల్స్ తదితరాలను పెంపొందించడం లక్ష్యంగా జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ దిశానిర్దేశంతో ప్రత్యేక సెషన్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మొత్తం 50 స్వర్ణగ్రామం, స్వర్ణ వార్డు ఉద్యోగులు, సమన్వయకర్త జి.జ్యోతి పాల్గొన్నారు.

## గో సేవే మహోన్నత మానవ సేవ

**నిస్వార్థంగా గోశాల నిర్వహిస్తున్న కుటుంబానికి అభినందనలు**

**ఇలాంటి గోశాలలకు ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం**

**వాగవేడు గోశాలను సందర్శించిన దండి నరేంద్ర**



**శ్రీకాళహస్తి, నంబర్ వన్:** వాగవేడు గ్రామంలో నిస్వార్థ సేవాభావంతో నిర్వహిస్తున్న గోశాలను సందర్శించిన జనసేన నాయకుడు దండి నరేంద్ర, గోమాతల సంరక్షణలో అంకితభావంతో సేవలందిస్తున్న రామకృష్ణ శర్మ కుటుంబాన్ని అభినందించారు. గోసేవ ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న ఇలాంటి గోశాలలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందించాలని కోరారు. ఈ సందర్భంగా దండి నరేంద్ర మాట్లాడుతూ, గత పదేళ్లుగా రామకృష్ణ శర్మ, ఉమా, కార్తీక్ స్వామి కుటుంబ సభ్యులే స్వయంగా ప్రేమ, కరుణ, నిస్వార్థ సేవాభావంతో గోశాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. వ్యాపార ప్రయోజనాల కోసం పాలను సేకరించకుండా, దూడల ఆరోగ్యవంతమైన ఎదుగుదల కోసం పూర్తిగా వాటికే వదిలివేయడం వారి మానవత్వానికి నిదర్శనమని కొనియాడారు. ఆవులకు దురద వచ్చినప్పుడు శరీరాన్ని రుద్దుకునేందుకు ప్రత్యేకంగా సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయడం వంటి అంశాలు మూగజీవాల పట్ల వారి శ్రద్ధను ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. గోశాల నిర్వహణలో ప్రతి అంశంలోనూ చూపుతున్న అంకితభావం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ శర్మ కుటుంబ సభ్యులు దండి నరేంద్రను వస్త్రాలతో సత్కరించారు. ఇలాంటి గోశాలలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు, ప్రోత్సాహకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఎన్‌డీఏ ప్రభుత్వం ద్వారా తన వంతు సహకారం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, గోశాల సేవకుడు మణి, జనసేన నాయకులు శశి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకున్న దండి నరేంద్ర



**శ్రీకాళహస్తి, నంబర్ వన్:** జనసేన నాయకుడు దండి నరేంద్ర గురువారం శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన రాహు--కేతు పూజలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలు, రైతాంగ శ్రేయస్సు, సామాన్య ప్రజల సుఖశాంతి, ప్రకృతి పరిరక్షణతో పాటు పక్షులు, పశుప్రాణులు సహా సమస్త జీవరాశుల సంక్షేమం కోసం స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం ఆలయంలో భక్తులకు అందిస్తున్న ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించిన దండి నరేంద్ర, పరిశుభ్రంగా, రుచికరంగా అన్నప్రసాదాన్ని అందిస్తున్న దేవస్థాన అధికారులను అభినందించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన తండ్రి, శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు సభ్యుడు, జనసేన సీనియర్ నాయకుడు దండి రాఘవయ్యతో పాటు చలం, శశి, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పేరం నాగరాజ నాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం



**ఏర్పేడు, నంబర్ వన్:** మండలంలోని గ్రంథాలయ కోబాక, మనసముద్రం, మేర్లపాక గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గురువారం డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజ నాయుడు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, వారి సమస్యలు, సూచనలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి, శివశంకర్ రెడ్డి, నైనార్ పున్నారావు, మోహన్ నాయుడు, సూరి నాయుడు, మహేష్ రెడ్డి, గాలి కృష్ణవేణి, క్లస్టర్ ఇన్‌చార్జి రాఘవేంద్ర, యూనిట్ నాయకులు కేశినేని సుబ్రమణ్యం, రాచేటి సుబ్రమణ్యం, భూపతి, కేకే రమణ, గుణా యాదవ్, పార్థసారథి, నరసింహులు నాయుడు, సుధాకర్ రెడ్డి, సదాశంకర్ నాయుడు, గోపాల్, శివారెడ్డి, రామదాసు, జయప్రకాష్ నారాయణ, చలపతి, వై. మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ముచ్చివోలులో 'మీ ఇంటికీ మీ సుధీరన్న'



**శ్రీకాళహస్తి, నంబర్ వన్:** మండల పరిధిలోని ముచ్చివోలు గ్రామ పంచాయతీ పరిధిలోని హరిజనవాడలో గురువారం నిర్వహించిన 'మీ ఇంటికీ మీ సుధీరన్న' కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముచ్చివోలు పంచాయతీకి రూ.14.83 కోట్లకు పైగా సంక్షేమ పథకాల లబ్ధి అందించామని తెలిపారు. అదనంగా గ్రామంలో రోడ్లు, తాగునీటి బోర్లు, ఆర్ఓ ప్లాంట్లు తదితర మౌలిక సదుపాయాల కోసం రూ.87.20 లక్షల విలువైన అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. పర్యటనలో భాగంగా అరకొరగా నిలిచిపోయిన స్థానిక అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌కు వీడియో కాల్ చేసి పరిస్థితిని వివరించారు. హరిజనవాడలోని చిన్నారుల కోసం భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అలాగే గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా ప్రాధాన్యంగా తీసుకుని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముచ్చివోలు పంచాయతీలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సుపరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అక్షింతల కృష్ణ యాదవ్, పార్టీ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## డీఎస్సీ అవకతవకలకు బాధ్యత వహిస్తూ నారా లోకేష్ రాజీనామా చేయాలి

**వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి**

**వైఎస్సార్‌సీపీ రిలే నిరాహార దీక్షలు ప్రారంభం**





**చంద్రగిరి, నంబర్ వన్:** డీఎస్సీ-2025 నియామకాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం పిలుపు మేరకు ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న రిలే దీక్షలకు పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో యువత, విద్యార్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ, డీఎస్సీ--2025 నియామకాలలో జరిగిన అక్రమాలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విచారణ పూర్తయ్యే వరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో యువతకు భారీ ఎత్తున ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఆ వాగ్దానాలను నిలబెట్టుకోలేదని విమర్శించారు. నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీల అమలులో కూడా ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. డీఎస్సీ నియామకాలలో ప్రత్యేక జీవోల ద్వారా అవకతవకలకు పాల్పడి అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ, ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్ చేశా రు. డీఎస్సీ-2025లో నష్టపోయిన ప్రతి అభ్యర్థికి న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగుతుందని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి స్పష్టం చేశారు.

# డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు

**డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి**

**వైసీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి**



**శ్రీకాళహస్తి, నంబర్ వన్:** డీఎస్సీ–2025 నియామకాలలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణ వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో భూమన కరుణాకర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెగా డీఎస్సీ పేరుతో ప్రభుత్వం అర్హులైన అభ్యర్థులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. స్పోర్ట్స్ కోటా పేరిట అర్హత లేని టీడీపీ కార్యకర్తలకు ఉద్యోగాలు కల్పించారని విమర్శించారు. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతవకలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హత లేని వారిని ఉపాధ్యాయులుగా నియమిస్తే విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని పేర్కొంటూ, అర్హత కలిగిన అభ్యర్థులకు న్యాయం చేయాలన్నదే తమ డిమాండ్ అని స్పష్టం చేశారు. డీఎస్సీ వ్యవహారంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల సమయం లో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని ప్రభుత్వం అమలు చేయలేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. విద్యార్థులు, నిరుద్యోగులకు పూర్తి న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని భూమన కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, శ్రీకాళహ స్తీశ్వర స్వామివారి దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సిద్దాగుంట సుధాకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలి

**గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రెడ్డివారి గురవారెడ్డి**



**తొట్టంబేడు, నంబర్ వన్:** మండల పరిధిలోని పూడి పంచాయతీలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీడీసీ (మినీ గ్రంథాలయం) సెంటర్‌ను ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రెడ్డివారి గురవారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్లు, అటెండెన్స్ రిజిస్టర్లు, పుస్తకాల రికార్డులు, పత్రికల రిజిస్టర్లను పరిశీలించారు. బీడీసీ సెంటర్ నిర్వాహకుడు జలగం శ్రీనివాసులు నాయుడిని వివిధ పత్రికలు, పుస్తకాల లభ్యత, తొట్టంబేడు శాఖ గ్రంథాలయం నుంచి ప్రతి 15 రోజులకు ఒకసారి పాఠకులకు అవసరమైన పుస్తకాలు అందుతున్నాయా అనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్మన్ గురవారెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆ క్రమంలోనే పూడి పంచాయతీలో బీడీసీ సెంటర్‌ను మినీ గ్రంథాలయంగా నిర్వహిస్తూ విద్యార్థులు, పాఠకులకు పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం 102 బీడీసీ సెంటర్లు పనిచేస్తున్నాయని పేర్కొంటూ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులను పుస్తక పఠనం వైపు ప్రోత్సహించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన పత్రికలు, పుస్తకాలు నిరంతరం అందుబాటులో ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని, సమీపంలోని తొట్టంబేడు శాఖ గ్రంథాలయం నుంచి ప్రతి 15 రోజులకు ఒకసారి కొత్త పుస్తకాలు తీసుకువచ్చి పాఠకులకు అందించాలని ఆదేశించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి గ్రంథాలయ సేవలపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తుడు మాధవ నాయుడు చైర్మన్ డాక్టర్ రెడ్డివారి గురవారెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తొట్టంబేడు శాఖ గ్రంథాలయ అధికారి హరికృష్ణ, గ్రామస్తులు శేషమ నాయుడు, మాధవ నాయుడు, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాయుడుపేట సెజ్‌లో రూ.3,000 కోట్లతో

# సోలార్ సెల్ తయారీ ప్లాంట్

**త్వరలో ఉత్పత్తి ప్రారంభం.. 3,000 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు**




**తిరుపతి, నంబర్ వన్:** నాయుడుపేట సెజ్‌లో రూ.3,000 కోట్ల పెట్టుబడితో ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ ఏర్పాటు చేస్తున్న 7 గిగావాట్ల సోలార్ సెల్ తయారీ ప్లాంట్ జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపు తీసుకురావడంతో పాటు వేలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనుందని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి ప్లాంట్ పురోగతిపై వివరించారు. సమావేశంలో సంస్థ డైరెక్టర్లు రేవతి రోహిణి, సుధీర్ రెడ్డి మూలా, సంస్థ సలహాదారు రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, ఇప్పటివరకు ప్లాంట్ నిర్మాణానికి రూ.3,000 కోట్ల పెట్టుబడి పెట్టామని, నిర్మాణ దశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 4,500 మందికి ఉపాధి కల్పించినట్లు తెలిపారు. ఇటీవల విద్యుత్ సరఫరా ప్రారంభమైన నేపథ్యంలో ఇన్‌స్టలేషన్, కమిషనింగ్ పనులను వేగవంతం చేసి మరో రెండు నెలల్లో ప్లాంట్‌ను ఉత్పత్తికి సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు. ప్లాంట్ కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత 3,000 మందికి పైగా ప్రత్యక్ష ఉద్యోగాలు కల్పించనున్నట్లు, స్థానిక యువతకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ఉద్యోగుల నివాస అవసరాల కోసం ఓజిలి మండలం అత్తివరం గ్రామంలో అందుబాటు ధరలో గృహ నిర్మాణ ప్రాజెక్టును కూడా చేపట్టినట్లు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రీమియర్ ఎనర్జీస్ ప్లాంట్ ప్రారంభం జిల్లా పారిశ్రామిక రంగానికి కీలక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. పరిశ్రమకు అవసరమైన రహదారులు, విద్యుత్, తాగునీరు తదితర మౌలిక వసతులను నిర్దేశిత గడువులో కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సంస్థ ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి రెవెన్యూ, ఏపీఐఐసీ, ఏపీఎస్పీడీసీఎల్, టుడా, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి, అవసరమైన పనులను కాలపరిమితిలో పూర్తి చేయాలని సూచించారు. జిల్లాకు భారీ పెట్టుబడులు రావడం ద్వారా పారిశ్రామికాభివృద్ధితో పాటు స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, పెట్టుబడిదారులకు అవసరమైన అన్ని రకాల సహకారం జిల్లా యంత్రాంగం అందిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భారత్ రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖర్ రావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రాజానాయక్, టుడా అధికారులు, ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సంక్షేమ వసతి గృహాల మరమ్మతు పనులు వేగవంతం చేయాలి

**విద్యార్థులకు మెరుగైన వసతి, మౌలిక సదుపాయాల కల్పనపై జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశాలు**



**తిరుపతి కలెక్టరేట్, నంబర్ వన్:** జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల భవనాల పునరుద్ధరణ, మరమ్మతు పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన వసతి, సురక్షిత వాతావరణం, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్సీ, బీసీ, ఎస్టీ సంక్షేమ శాఖల పరిధిలోని వసతి గృహాల మరమ్మతు పనుల భౌతిక, ఆర్థిక పురోగతిపై కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి గృహాల్లో పైకప్పులు, గోడలు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, వంటశాలలు, డ్రైనేజీ, ప్రహరీ గోడలు తదితర మౌలిక వసతుల మరమ్మతులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడొద్దని స్పష్టం చేసిన కలెక్టర్, కేవలం రికార్డుల ఆధారంగా కాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల నాణ్యతను నిర్ధారించిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి వసతి గృహానికి మంజూరైన నిధులు, ఖర్చు చేసిన మొత్తం, పెండింగ్ బిల్లులు, పనుల ప్రస్తుత స్థితిపై శాఖల వారీగా పూర్తి వివరాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. పనుల భౌతిక పురోగతికి అనుగుణంగా ఆర్థిక పురోగతి కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పనుల ప్రారంభం లేదా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం లేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు పరిశుభ్రమైన, సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కలెక్టర్, అత్యవసర మరమ్మతు పనులను గుర్తించి ప్రాధాన్యత ఆధారంగా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి హరీష్, బీసీ సంక్షేమ శాఖ అధికారి భరత్ రెడ్డి, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి రాజా సోము, గనుల శాఖ అధికారి బాలాజీ నాయక్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శ్రీవ్యాసాశ్రమ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలి

**జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, బీజేపీ నేత కోలా ఆనంద్**




**తిరుపతి, నంబర్ వన్:** శ్రీవ్యాసాశ్రమానికి సంబంధించిన వ్యవహారాలపై వస్తున్న ఆరోపణలను సమగ్రంగా విచారించాలని కోరుతూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు, ఆధ్యాత్మికవేత్తలతో కలిసి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, సద్గురు మహర్షి శ్రీ మలయాళ స్వామి స్థాపించిన శ్రీవ్యాసాశ్రమం ఆధ్యాత్మిక చైతన్యం, విద్య, సేవ, త్యాగానికి ప్రతీకగా నిలిచిందన్నారు. వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఆధ్యాత్మిక సంస్థపై ప్రస్తుతం వివిధ ఆరోపణలు, వివాదాలు వినిపించడం భక్తులను ఆందోళనకు గురిచేస్తోందని పేర్కొన్నారు. ఆశ్రమ నిర్వహణకు సంబంధించి పీఠాధిపతి, ఆయన సోదరుడు శివరాంరెడ్డి, అలాగే నెల్లూరుకు చెందిన అమర్నాథ్ రెడ్డిపై పలు ఆరోపణలు ఉన్నాయని, ఈ అంశాలపై ఇప్పటికే అధికారులకు ఫిర్యాదులు అందినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత వ్యవహారాలపై స్వతంత్రంగా, నిష్పాక్షికంగా సమగ్ర విచారణ జరిపించాలని, ఎవరైనా తప్పు చేసి ఉంటే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ డిమాండ్ చేశారు.

## డిఫెన్స్ మద్యం అక్రమ రవాణాపై ఎక్సైజ్ దాడి

**రూ.3 లక్షల విలువైన మద్యం, కారు సీజ్ ప్రధాన నిందితుడు పరార్**

**ఎక్సైజ్ సీఐ సునీల్ కుమార్**



**నర్సీపట్నం, నంబర్ వన్:** డిఫెన్స్ మద్యం అక్రమ రవాణాపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం మోపింది. మున్సిపాలిటీ పరిధిలోని జోగినాధునిపాలెం సమీపంలో గురువారం నిర్వహించిన తనిఖీల్లో రూ.3 లక్షల విలువైన డిఫెన్స్ మద్యం, దానిని తరలిస్తున్న కారును ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ సీఐ సునీల్ కుమార్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మాకవరపాలెం మండలం వజ్రగడ గ్రామానికి చెందిన అప్పలనాయుడు డిఫెన్స్ మద్యాన్ని కారులో తరలిస్తుండగా ఎక్సైజ్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. అధికారులను గమనించిన అప్పలనాయుడు అక్కడి నుంచి పరారయ్యాడు. అయితే కారును నడుపుతున్న జెర్రిపోతుల గోవిందరావును అదుపులోకి తీసుకున్నారు. కారులో తనిఖీ చేయగా ఎనిమిది రకాల బ్రాండ్లకు చెందిన మొత్తం 44 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మద్యం సహా కారు విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. మద్యం తరలింపునకు ఉపయోగించిన కారును కూడా సీజ్ చేశారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు అప్పలనాయుడు కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని సీఐ సునీల్ కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో అనకాపల్లి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఈశ్వరరావు, నర్సీపట్నం ఎక్సైజ్ సర్కిల్ సబ్‌ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఆరుష్ రెడ్డి




**హైదరాబాద్, నంబర్ వన్:** నగరంలోని జాన్సన్ గ్రామర్ స్కూల్ ఆధ్వర్యంలో షామీర్‌పేటలోని ఆష్ స్పోర్ట్స్ అకాడమీలో ఆగస్టు 5న నిర్వహించిన సీఐఎస్‌సీఈ స్పోర్ట్స్ అండ్ గేమ్స్--2026 ఆంధ్రప్రదేశ్--తెలంగాణ రీజియన్ లాన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఫ్యూచర్ కిడ్స్ స్కూల్‌కు చెందిన యేడుగురి ఆరుష్ రెడ్డి ప్రతిభ కనబర్చాడు. అండర్--14 విభాగంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్న ఆరుష్ రెడ్డి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. పతక ప్రదానోత్సవంలో ఆరుష్ రెడ్డి మాట్లాడుతూ, జాతీయ స్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. ఆయన విజయంపై పాఠశాల యాజమాన్యం, కోచ్‌లు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**డీఎస్సీ పేపర్ లీకేజీపై లోకేష్ రాజీనామా చేయాలి**

**మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో వైసీపీ రిలే నిరాహార దీక్షలు**



**నాతవరం, నంబర్ వన్:** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతిని అమలు చేయాలని, డీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొడ్డెడ ప్రసాద్, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బొడ్డెడ ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. అలాగే ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనపై స్పందించిన ఆయన, ఈ ఘటనతో విద్యా వ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతిందని పేర్కొన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, నిరుద్యోగ భృతి అమలు, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం జరిగే వరకు ప్రభుత్వంపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రిలే నిరాహార దీక్షల్లో మండల పార్టీ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, ఎంపీపీ లక్ష్మణమూర్తి, జడ్పీటీసీ కాపారపు అప్పలనరస, పైల సునీల్, కరక రాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## మహిళా పారిశ్రామికవేత్తలకు
# కేంద్రం భారీ చేయూత

**గత ఐదేళ్లలో 6.66 లక్షల మంది మహిళలకు నైపుణ్య శిక్షణ**

**ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం**



**విజయవాడ, నంబర్ వన్:** మహిళా సాధికారత, సూక్ష్మ పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే వెల్లడించారు. లోక్‌సభలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అడిగిన ప్రశ్నకు ఆమె లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 42,211 నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించగా, 19,54,701 మందికి శిక్షణ అందించామని తెలిపారు. వారిలో 6,66,327 మంది మహిళలు ఉన్నట్లు వెల్లడించారు. వస్త్ర పరిశ్రమతో పాటు పలు రంగాల్లో మహిళలు స్వయం ఉపాధి అవకాశాలు పొందేలా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పరిశ్రమల అభివృద్ధి, మహిళల ఆర్థిక స్వావలంబన, ఉపాధి అవకాశాల పెంపు కోసం కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా ప్రోత్సాహం అందిస్తోందని సమాధానంలో వివరించారు.

## ఆహార పథకాల అమలులో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

**అవకతవకలపై బాధ్యులపై కఠిన చర్యలు : రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు ఈ. లక్ష్మీరెడ్డి**



**విశాఖపట్నం, నంబర్ వన్:** ప్రభుత్వం అమలు చేస్తున్న ఆహార పథకాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్నీ సహించబోమని, అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు ఈ. లక్ష్మీరెడ్డి హెచ్చరించారు. గురువారం భీమునిపట్నం మండలం, విశాఖ నగర పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, ఫెయిర్ ప్రైస్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన పలు లోపాలను గుర్తించారు. నేరెళ్లవలస అంగన్‌వాడీ కేంద్రంలో భౌతికంగా ఐదుగురు పిల్లలు మాత్రమే హాజరై ఉండగా, ఆన్‌లైన్‌లో ఎనిమిది మంది పూర్తి హాజరుగా నమోదు చేసినట్లు గుర్తించి సంబంధిత అంగన్‌వాడీ కార్యకర్త, సూపర్‌వైజర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఎగువపేట--2 అంగన్‌వాడీ కేంద్రంలో కూడా హాజరు నమోదులో వ్యత్యాసాలు, సరుకుల పంపిణీ రికార్డుల్లో లోపాలు బయటపడటంతో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ ఎంపీపీ పాఠశాల, తోటవీధి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, పంపిణీ రికార్డులను పరిశీలించి పలు లోపాలను గుర్తించారు. భీమునిపట్నం ఫెయిర్ ప్రైస్ షాప్‌లో 996 రేషన్ కార్డుల్లో 823 మందికే చక్కెర పంపిణీ జరిగినట్లు గుర్తించి మిగిలిన లబ్ధిదారులకు వెంటనే సరఫరా చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారిని ఆదేశించారు. కేజీబీవీ పాఠశాలలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూను పాటించకుండా వేరే కూర వండినట్లు గుర్తించి సంబంధిత ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకులం, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో కూడా ఆహార నాణ్యత, స్టాక్ రిజిస్టర్లు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. మారికవలస ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూను పాటించకపోవడంతో పాటు ఆహార నాణ్యత సంతృప్తికరంగా లేదని గుర్తించారు. ఈ సందర్భంగా ఈ. లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ, చిన్నారులు, విద్యార్థులు, లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ఆహార పథకాల అమలులో తప్పుడు హాజరు నమోదులు, సరుకుల దుర్వినియోగం, మెనూ ఉల్లంఘనలు, ఆహార నాణ్యతలో లోపాలు, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యంపై రాజీపడబోమన్నారు. జాతీయ ఆహార భద్రతా చట్టం--2013 నిబంధనలను కచ్చితంగా అమలు చేసి ప్రతి అర్హ లబ్ధిదారునికి నాణ్యమైన ఆహారం, నిత్యావసర సరుకులు సకాలంలో అందేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

## శ్రీ సత్య సాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



**కశింకోట, నంబర్ వన్:** మండలంలోని తాళ్లపాలెం శ్రీ సత్యసాయి భజన కేంద్రంలో గురువారం ఫౌండేషన్ కంటి ఆసుపత్రి, అనకాపల్లి జిల్లా శ్రీ సత్యసాయి సేవా సంస్థలు జోన్-2 సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి సుమారు 100 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకోగా, వారిలో 37 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. శిబిరంలో జిల్లా శ్రీ సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, భజన కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్ వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కశిరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ, శ్రీ సత్యసాయి సేవా సంస్థలు నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు జూరెడ్డి రాము మాట్లాడుతూ, శ్రీ సత్యసాయి సేవా సంస్థలు ప్రేమ, నిస్వార్థ సేవాభావంతో సమాజానికి విశిష్ట సేవలు అందిస్తున్నాయని కొనియాడారు. భగవంతునిపై అచంచల విశ్వాసంతో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న సాయి భక్తులను అభినందించారు. అనంతరం నిర్వహించిన నారాయణ సేవలో నాయకులు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకట్రావు, క్యాంప్ ఆర్గనైజర్ అశ్వినికుమార్, టెక్నీషియన్లు, సేవాదళ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు పొందడం ప్రతి అర్హుడి బాధ్యత

**అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసి ఓటరుగా నమోదు కావాలి**

**క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 30 వరకు గడువు**

**సెప్టెంబర్ 28 నాటికి క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ**



**నందిగామ, నంబర్ వన్:** అర్హులైన ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటు హక్కు పొందాలని, ఓటరుగా నమోదు కావడం ప్రతి ఒక్కరి రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ సమర్థవంతంగా అమలవుతున్న తీరును జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. పట్టణ పరిధిలో క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిశీలనకు జారీ చేస్తున్న నోటీసులను పరిశీలించారు. బీఎల్‌వోలు ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం స్వీకరించి సకాలంలో విచారణ పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. జిల్లాకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను జూలై 31, 2026న విడుదల చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఏదైనా కారణంతో ఓటరు జాబితాలో పేరు నమోదు కాకపోయినా, లేదా పేరు తొలగించబడినా, అర్హులైన వారు నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నారు. సంబంధిత బీఎల్‌వోను సంప్రదించి అవసరమైన ధ్రువపత్రాలతో క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేసుకోవాలని సూచించారు. సమర్పించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై నోటీసులు జారీ చేసి, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించిన అనంతరం అర్హత ఉన్న ప్రతి ఒక్కరిని తిరిగి ఓటర్ల జాబితాలో నమోదు చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ప్రతి దరఖాస్తును పారదర్శకంగా పరిశీలించి నిబంధనల మేరకు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలుకు ఆగస్టు 30, 2026 వరకు గడువు ఉందని కలెక్టర్ వెల్లడించారు. అందిన అన్ని దరఖాస్తులను పరిశీలించి సెప్టెంబర్ 28, 2026 నాటికి పరిష్కరించేలా చర్యలు చేపడతామని తెలిపారు. గడువు ముగిసేలోపు అర్హులైన ప్రతి ఒక్కరూ తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు. గతంలో ఓటరుగా నమోదై ఉండి, ప్రస్తుతం ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేకపోయిన వారు భారత ప్రభుత్వం నిర్దేశించిన 11 ఆమోదిత ధ్రువపత్రాల్లో ఏదో ఒకటి ఆధారంగా సమర్పించి తమ అభ్యంతరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. సరైన ఆధారాలతో దరఖాస్తు చేస్తే నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హత ఉన్న వారికి ఓటరు హక్కు కల్పిస్తామని తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి భారత పౌరుడు ఓటరు హక్కుకు అర్హుడని పేర్కొన్న కలెక్టర్, అర్హులైన యువత సంబంధిత ధ్రువపత్రాలతో ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకుని తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో ఆర్డీవో ఎ.అనిల్ కుమార్, తహసీల్దార్ నూతక్కి సురేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ లోవరాజు, ఎంపీడీవో వరప్రసాద్, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎరువులకు కొరత లేదు

**శ్రీ మణికంఠ సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్‌లో అకస్మిక తనిఖీ**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ**



**నందిగామ, నంబర్ వన్:** పట్టణంలోని శ్రీ మణికంఠ సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ దుకాణాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ గురువారం ఆకస్మికంగా సందర్శించి ఎరువుల పంపిణీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులకు పారదర్శకంగా ఎరువులు అందుతున్నాయా, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నారా అనే అంశాలపై స్వయంగా తనిఖీ నిర్వహించారు. దుకాణంలో రైతులకు అవసరమైన హెల్ప్‌లైన్ నంబర్లు, ఎరువుల ధరల పట్టికలు స్పష్టంగా ప్రదర్శించారా లేదా అని పరిశీలించారు. అలాగే ఎరువులు కొనుగోలు చేస్తున్న రైతులు సంబంధిత పంట నమోదును పూర్తి చేసుకున్నారా అనే విషయాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా కేటాయించిన ఎరువుల వివరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రైతుకు ఉన్న సాగుభూమి విస్తీర్ణం, పంట నమోదు, అర్హత మేరకు యూరియా, డీఏపీ వంటి ఎరువుల కేటాయింపు, ఇప్పటికే పొందిన పరిమాణం, ఇంకా పొందాల్సిన నిల్వ తదితర వివరాలను యాప్‌లో పరిశీలిస్తూ అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల కొరత లేదని స్పష్టం చేశారు. ఎవరూ ఎరువుల కోసం క్యూ లైన్లలో నిలబడాల్సిన అవసరం లేదన్నారు. ఏపీఏఐఎంఎస్ యాప్‌లో నమోదు చేసుకున్న ప్రతి రైతు తన అర్హత మేరకు ఎప్పుడైనా ఎరువులు పొందవచ్చని తెలిపారు. ప్రతి రైతుకు ప్రభుత్వం కేటాయించిన ఎరువుల కోటా ఆయా రైతులకే కేటాయింపుగా ఉంటుందని, ఒకేసారి తీసుకోవాల్సిన అవసరం లేదని, అవసరమైన సమయంలో తమ కోటా మేరకు ఎరువులు పొందవచ్చని వివరించారు. రైతులు అవసరానికి మించి రసాయన ఎరువులు వినియోగించరాదని జిల్లా కలెక్టర్ సూచించారు. అధిక ఎరువుల వినియోగం వల్ల పంటలు, భూసారం, పర్యావరణం, అలాగే ఆహారాన్ని వినియోగించే ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం ఉంటుందని చెప్పారు. శాస్త్రీయ ప్రమాణాల ప్రకారం ఒక ఎకరాకు అవసరమైన పరిమాణంలో మాత్రమే ఎరువులు వినియోగించాలని రైతులకు సూచించారు. పచ్చిరొట్ట పంటలు సాగు చేయడం ద్వారా భూసారం పెరిగి, రసాయన ఎరువుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే పంట మార్పిడి విధానాన్ని పాటించడం ద్వారా భూమి సారవంతంగా ఉండటంతో పాటు రైతులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఎలినినో ప్రభావం ఉన్న నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను నివారించడంతో పాటు లాభదాయకమైన వ్యవసాయం చేయవచ్చన్నారు. అనంతరం రాఘవాపురం గ్రామంలో సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న పంట పొలాలను జిల్లా కలెక్టర్ సందర్శించి రైతులతో నేరుగా మాట్లాడారు. పంటల దిగుబడి, సాగు విధానాలు, మార్కెట్ అవకాశాలపై వివరాలు తెలుసుకున్నారు. రైతులు బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకున్నారా అనే విషయంపై కూడా ఆరా తీశారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా పండించిన కూరగాయలు, ఆహార ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు రుచికరంగా ఉండటంతో పాటు పోషక విలువలు కూడా అధికంగా ఉంటాయని పేర్కొన్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రజలు రైతులు పండించిన సేంద్రియ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతులు కూడా ప్రతి ఏడాది సేంద్రియ సాగు విస్తీర్ణాన్ని పెంచుతూ ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ పర్యటనలో ఆర్డీవో ఎ.అనిల్ కుమార్, తహసీల్దార్ నూతక్కి సురేష్ బాబు, ఎంపీడీవో వరప్రసాద్, ఏవో శరత్ బాబు, రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులందరికీ పోషకాహారం : జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



**నందిగామ, నంబర్ వన్:** ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తున్న పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని ప్రతి విద్యార్థి తప్పనిసరిగా భుజించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. సమతుల ఆహారం విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి ఎంతగానో దోహదపడుతుందని, విద్యలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కూడా ఇది ఎంతో అవసరమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని స్వీకరించి రుచి చూశారు. పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ గురువారం ఆకస్మికంగా సందర్శించి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలును క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం అందిస్తున్నారా అనే అంశాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజన తయారీ విధానం, వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, వంట ప్రక్రియ, నిల్వల పరిస్థితి తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. కిచెన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఆహార నిల్వల రిజిస్టర్లు, స్టాక్ నిర్వహణ, విద్యార్థుల హాజరు నమోదులను కూడా తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రత్యేక శ్రద్ధతో పోషక విలువలు కలిగిన సమతుల ఆహార మెనూను రూపొందించి అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పాఠశాలలోనే భుజించాలని సూచించారు. సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారా శారీరక ఎదుగుదలతో పాటు మానసిక వికాసం కూడా మెరుగుపడి చదువులో మంచి ప్రతిభ కనబరచడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ముఖ్యంగా బాలికలు మధ్యాహ్న భోజనాన్ని నిర్లక్ష్యం చేయకుండా తప్పనిసరిగా పాఠశాలలోనే భుజించాలని కలెక్టర్ సూచించారు. పెరుగుతున్న వయస్సులో సరైన పోషకాహారం తీసుకోవడం ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ ఆధునిక వసతులను కల్పిస్తోందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అర్హత కలిగిన, నైపుణ్యం గల ఉపాధ్యాయులను నియమించి బోధన అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడేలా ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు చేపడుతోందన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఆర్డీవో ఎ.అనిల్ కుమార్, తహసీల్దార్ నూతక్కి సురేష్ బాబు, ఎంపీడీవో వరప్రసాద్, ఎంఈఓ పద్మ, రెవెన్యూ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల అభ్యున్నతికి సమష్టి కృషి చేయాలి

**ఎస్టీ వర్గాల సంక్షేమం, ఉపాధి, విద్యపై ప్రత్యేక దృష్టి అవసరం**

**ఏపీ శాసనసభ షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ మిరియాల శిరీషా దేవి**

**కేజీహెచ్‌లో గిరిజనులకు ప్రత్యేక సేవలు అందుతున్నాయి**

**జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్**



**విశాఖపట్నం, నంబర్ వన్:** గిరిజనుల అభ్యున్నతికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సంక్షేమ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ మిరియాల శిరీషా దేవి అధికారులను ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, రోస్టర్ పాయింట్ల అమలు, గృహనిర్మాణం, పింఛన్లు, స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్న రుణాలు, గిరిజన సంక్షేమ పథకాల అమలుపై కమిటీ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వాలు గిరిజన విద్యార్థులు, గిరిజన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాయని పేర్కొన్న ఆమె, ఎక్కడైనా లోపాలు ఉంటే ఈ పర్యటనల ద్వారా గుర్తించి సరిదిద్దుకునేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. నగరంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించామని, అక్కడి విద్యా, వసతి సదుపాయాలు సంతృప్తికరంగా ఉన్నాయని చైర్పర్సన్ ఈ సందర్భంగా గుర్త చేశారు. గిరిజన ప్రాంతాల్లోని అనేక గురుకులాల కంటే నగరంలోని ఈ గురుకులంలో మెరుగైన వసతులు ఉన్నాయని పేర్కొన్నారు. సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల ప్రధానమంత్రి పర్యటన సందర్భంగా సుమారు 13 వేల మంది గిరిజన కళాకారులు థింసా నృత్యం ప్రదర్శించడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. గిరిజనుల సంప్రదాయాలు, సంస్కృతిని జాతీయ స్థాయిలో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఈ క్రమంలో గుర్తు చేశారు. గిరిజన విద్యార్థులకు అవసరమైన వ్యక్తిగత వినియోగ వస్తువులను గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అరకు కాఫీకి మరింత ప్రచారం కల్పించి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని, గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు చేపట్టాలన్నారు. పీఎం సూర్యఘర్ వంటి పథకాలపై గిరిజన ప్రాంతాల్లో మరింత అవగాహన కల్పించి లబ్ధిదారులకు ప్రయోజనాలు అందేలా చూడాలన్నారు. తమ పర్యటనలో మొత్తం వ్యవస్థపై సంతృప్తి వ్యక్తమైందని, అయితే గిరిజనుల అభ్యున్నతికి ఇంకా మెరుగైన ఫలితాలు సాధించేందుకు అన్ని శాఖలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజనులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి సమన్యాయం జరిగేలా చూడటమే కమిటీ ప్రధాన ఉద్దేశమని ఆమె స్పష్టం చేశారు. కేజీహెచ్‌కు గిరిజన ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో రోగులు వస్తున్నందున వారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని కమిటీ సూచించగా స్పందించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ కేజీహెచ్‌లో గిరిజనుల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి అన్ని రకాల సేవలు అందిస్తున్నామని వివరించారు. కమిటీ సభ్యుడు నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల్లో పోటీ పరీక్షలపై ఆసక్తి పెంచేందుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నిపుణుల చేత కోచింగ్ అందించి ఉన్నత ఉద్యోగాలకు గిరిజన యువతను సిద్ధం చేయాలని అభిప్రాయపడ్డారు. గిరిజన సంక్షేమానికి సంబంధించిన సెల్‌లను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెందుర్తి ప్రాంత గిరిజనులు కోరిన కమ్యూనిటీ భవన నిర్మాణ అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను కమిటీ ఆదేశించింది. గిరిజనుల సంక్షేమానికి కొత్త ఆలోచనలు, వినూత్న ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించింది. సమావేశంలో కమిటీ సభ్యులు పేరాబత్తుల రాజశేఖరం, నిమ్మక జయకృష్ణ, రేగ మత్స్యలింగం, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, జీసీసీ ఎండీ శోభిక, అసెంబ్లీ జాయింట్ సెక్రటరీ పి.వి. సుబ్బారెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ యు. నాగమునియ్య, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వరనాయుడుతో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.


# ఎముకలు, కీళ్ల ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాలి

**- లీ ఫౌండేషన్ ట్రస్టీ ఆళ్ల లీలారాణి - లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం**







**నాంపల్లి (హైదరాబాద్):** ఎముకలు, కీళ్ల సంరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని లీ ఫౌండేషన్ ట్రస్టీ ఆళ్ళ లీలారాణి పిలుపునిచ్చారు. లీ ఫౌండేషన్, అనుపమ గౌడ్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న అనుపమ కళ్యాణ మండపంలో గురువారం ఉచిత ఎముకలు, కీళ్ల ఆరోగ్య మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మందికి పైగా ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో భాగంగా ఎముకల సాంద్రత (బోన్ మినరల్ డెన్సిటీ), బాడీ కంపోజిషన్, హిమోగ్లోబిన్, రాండమ్ బ్లడ్ షుగర్, రక్తపోటు, శరీర ఉష్ణోగ్రత, మానవమితి కొలతలు, నడుము--పండ్లు చుట్టుకొలత, హ్యాండ్ గ్రిప్ బలం తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యులు, న్యూట్రిషనిస్టులు పరీక్షల నివేదికలను పరిశీలించి ఆరోగ్య సూచనలు అందించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆళ్ళ లీలారాణి మాట్లాడుతూ, ఎముకలు, కీళ్లు దృఢంగా ఉండేందుకు పోషక విలువలు అధికంగా ఉన్న నాణ్యమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ మేనేజర్ సురేష్, క్యాంప్ కోఆర్డినేటర్లు జయలక్ష్మి, సరోజిని, క్లినికల్ న్యూట్రిషనిస్టులు మాధురి, శివప్రియ, శాంతి, క్లినికల్ ఫార్మాసిస్ట్ యువరాజ్, లీ ఫౌండేషన్ ప్రతినిధులు గౌరవ్, అజిత్, అనుపమ గౌడ్ ట్రస్ట్ అధ్యక్షుడు ఆనంద్ కుమార్, బీఎం శాల స్కూల్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# ఊర మాస్.. ది ప్యారడైజ్

నాచురల్ స్టార్ నాని, మాస్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్'. 'దసరా' వంటి కల్ట్ బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న ఈ క్రేజీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ నుంచి తాజాగా అదిరిపోయే టీజర్ విడుదలైంది. ఇందులో నాని 'జడల్' అనే ఊర మాస్ పాత్రలో నెవర్ బిఫోర్ లుక్‌తో విశ్వరూపం చూపించారు. ప్రచార చిత్రం చూస్తుంటే బాక్సాఫీస్ వద్ద పెద్ద జాతరే జరగబోతోందని అర్థమవుతోంది... విడుదలైన టీజర్ మామూలుగా లేదు. 1980ల కాలం నాటి బ్యాక్‌డ్రాప్‌లో, సమాజంలో అణచివేతకు గురైన వర్గం తమ ఉనికి కోసం చేసే పోరాటానికి నాయకుడిగా నాని కనిపిస్తున్నారు. "ఈ దేశం ఎవరిది? ఈ జాగా ఎవరిది?" అంటూ కత్తులు పట్టుకుని నాని అరిచే అరుపులు మాస్ ఆడియన్స్‌కు ఫుల్ మీల్స్ అని చెప్పాలి. ఇక కండలు తిరిగిన దేహంతో, జడల జుట్టుతో నాని ఇంటెన్స్ అవతార్ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. టీజర్‌కి బిగ్గెస్ట్ హైలైట్ మాత్రం ఆ చివర్లో నాని చెప్పిన పవర్ ఫుల్ డైలాగ్. "ఇరుగు దృష్టి, పొరుగు దృష్టి.. నల్లి గుట్లోన్ దృష్టి, బెదురు గుట్లోన్ దృష్టి..చెడు చూపులన్నీ పోవాలి అన్నీ దూరం కావాలి... థూ థూ థూ!అంటూ నాని చెప్పిన తీరు థియేటర్స్ లో పూనకాలు పుట్టించేలా వుంది. ఇక ఆ కలెక్షన్ కింగ్ మోహన్ బాబు గారి స్టైల్, డైలాగ్ చెప్తే ఎలాంటి బేస్ ఉంటుందో, సేమ్ అదే వైబ్‌తో నాని థియేటర్లలో దద్దరిల్లేలా చేశారు.




# చకచకా రాకా మూవీ షూటింగ్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ప్రస్తుతం మాతృత్వాన్ని ఆస్వాదిస్తూ కుటుంబంతో సమయం గడుపుతున్నారు. అయితే ఆమె మెటర్నటీ బ్రేక్ కారణంగా అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'రాకా' షూటింగ్‌కు ఆటంకం ఏర్పడుతుందనే ప్రచారం జరుగుతున్న వేళ, చిత్రబృందం అందుకు పూర్తి భిన్నంగా ముందుకు సాగుతున్నట్లు సమాచారం. సినీ వర్గాల సమాచారం ప్రకారం, దీపికా మెటర్నటీ బ్రేక్‌ను ముందుగానే దృష్టిలో పెట్టుకుని చిత్రబృందం షూటింగ్ షెడ్యూల్‌ను ఎంతో కచ్చితంగా ఎ÷-లాన్ చేసింది. ఆమె అందుబాటులో ఉన్న సమయంలోనే ఎక్కువ భాగం సన్నివేశాలను పూర్తి చేయడంతో ప్రస్తుతం షూటింగ్ ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతోంది. దీపికా విరామంలో ఉన్న రోజుల్లో ఇతర ప్రధాన నటీనటులతో చిత్రీకరణ నిర్వహిస్తూ ఒక్క రోజు కూడా వృథా కాకుండా మేకర్స్ జాగ్రత్తలు తీసుకున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం దీపికా పదుకొణెకు సంబంధించిన షూటింగ్ దాదాపు పూర్తయినట్లు సమాచారం. చిన్న సన్నివేశాలు మాత్రమే ఉండగా, వాటిని తర్వాతి దశలో చిత్రీకరించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆమె వ్యక్తిగత జీవితానికి, సినిమా నిర్మాణానికి మధ్య ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మేకర్స్ పక్కా ప్లానింగ్ చేసినట్లు తెలుస్తోంది. 'రాకా' సినిమాలో దీపికా పదుకొణె పాత్ర కథకు అత్యంత కీలకమని సమాచారం. ఆమె పాత్ర చుట్టూనే కథలో ప్రధాన మలుపులు తిరుగుతాయని టాక్ వినిపిస్తోంది. అందుకే షూటింగ్ ప్రారంభ దశలోనే ఆమె సన్నివేశాలకు ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేసినట్లు తెలుస్తోంది.భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'రాకా' ఒకటిగా నిలిచింది. భారీ తారాగణం, హై టెక్నికల్ స్టాండర్డ్స్, భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. షూటింగ్ అనుకున్న షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతుండటంతో, సినిమా విడుదల కూడా నిర్ణయించిన సమయానికే జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# టీ20 క్రికెట్‌లో కొత్త రారాజు

## జోస్ బట్లర్ ప్రపంచ రికార్డు



ఇంగ్లండ్ విధ్వంసకర బ్యాటర్, కెప్టెన్ జోస్ బట్లర్ టీ20 క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా ప్రపంచ రికార్డును తన పేరున లిఖించుకున్నాడు. ఇప్పటివరకు అగ్రస్థానంలో ఉన్న వెస్టిండీస్ దిగ్గజం కీరన్ పొలార్డ్‌ను అధిగమించి టీ20 పరుగుల రారాజుగా అవతరించాడు. ఇంగ్లండ్‌లో జరుగుతున్న 'ది హండ్రెడ్' లీగ్‌లో మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ తరఫున ఆడుతున్న బట్లర్, వెల్ష్ ఫైర్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ చారిత్రక మైలురాయిని అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో బట్లర్ కేవలం 20 బంతుల్లోనే 2 ఫోర్లు, 6 సిక్సర్లతో అజేయంగా 51 పరుగులు చేసి తన జట్టును గెలిపించాడు. ఈ ఇన్నింగ్స్‌తో అతను టీ20ల్లో మొత్తం 14,833 పరుగుల మార్కును చేరుకున్నాడు. ఇప్పటివరకు 746 మ్యాచ్‌ల్లో 14,803 పరుగులతో పొలార్డ్ అగ్రస్థానంలో ఉండగా, బట్లర్ కేవలం 522 మ్యాచ్‌ల్లోనే ఈ రికార్డును బద్దలుకొట్టడం విశేషం. ఈ జాబితాలో యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ (463 మ్యాచ్‌ల్లో 14,562 పరుగులు) మూడో స్థానంలో ఉన్నాడు. బట్లర్ తన టీ20 కెరీర్‌లో ఇప్పటివరకు 9 సెంచరీలు, 105 హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు. ఈ ఘనత సాధించిన అనంతరం బట్లర్ స్పందిస్తూ ఆనందం వ్యక్తం చేశాడు. "టీ20ల్లో అందరికంటే ఎక్కువ పరుగులు చేయడం గొప్ప అనుభూతినిస్తోంది. ఇది గర్వకారణమైన క్షణం. భవిష్యత్తులో ఎవరో ఒకరు ఈ రికార్డును అధిగమిస్తారు. అతడు బహుశా సూర్యవంశీ కావచ్చు" అని సరదాగా వ్యాఖ్యానించాడు. "క్రికెట్ ఎంత వేగంగా మారిపోతుందో చెప్పలేం. కొన్ని నెలల క్రితం ఫామ్ కోసం చాలా ఇబ్బంది పడ్డాను. కానీ, గత కొన్ని వారాలుగా నా కెరీర్‌లోనే అత్యుత్తమంగా బ్యాటింగ్ చేస్తున్నట్లు అనిపిస్తోంది. ఫామ్‌ను తిరిగి పొందడానికి ఎంతో కష్టపడ్డాను. పట్టుదలతో మళ్లీ ఇక్కడికి వచ్చాను" అని బట్లర్ చెప్పుకొచ్చాడు. ఇక మ్యాచ్ విషయానికొస్తే.. తొలుత బ్యాటింగ్ చేసిన వెల్ష్ ఫైర్ జట్టు 100 బంతుల్లో 4 వికెట్లకు 155 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో మాంచెస్టర్ సూపర్ జెయింట్స్, టిమ్ సీఫెర్ట్ (62 నాటౌట్), బట్లర్ (51 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌లతో 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

Printed, Published and Owned by Muppirisetty Jagadeesh. Printed at M/S. Arunodaya Notebook Manufacturers Private Limited, H.No: 33-5-9, Papaih Street, Seetharamapuram, Vijayawada 520002. And Published From H.No: 61-3/5-6/6, Krishnalanka, Vijayawada 520013, Andhra Pradesh. Editor: Muppirisetty Jagadeesh PRGI No : APTEL/25/A1175, Phone No: 9044417999, E-mail: andhranumberone@gmail.com